
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 9 జూలై 2025 | 5

ఎన్‌వోసీలు ఆపండి

- 'పక్కాగా స్కెచ్'పై ఆంధ్రజ్యోతి కథనం ఎఫెక్ట్
- ప్రత్తిపాడులో నలుగురు తహసీల్దార్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో మైనింగ్ దరఖాస్తుదారులకు స్కెచ్‌ల విక్రయ బాగోతంపై కలెక్టర్ల ఆరా

7

జిల్లావ్యాప్తంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'

రాజమహేంద్రవరం, జూలై8(ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాలతో ఎస్పీ నరసింహ కిషోర్ స్వీయ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్' నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాలలు, కళాశాలలకు 100మీటర్ల సమీపం లోని కిళ్లీ బడ్డీలు, కిరాణా దుకా ణాలు, ఫ్యాన్సీ తదితర షాపుల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. షాపుల్లోని డస్ట్ బిన్‌లతో సహా క్షుణ్ణంగా పరిశీలించారు. పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఖైనీ నిల్వలు, నిషేధిత మత్తు పదా ర్థాల అమ్మకాలే లక్ష్యంగా ఈ సోదాలు చేశారు. పెద్దఎత్తున వాటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. వీటిలో 'లావాదేవీలు' జరిగాయని తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న సరుకు వివరాలు, కేసుల సంఖ్యను పోలీసులు వెల్లడించకపోవడం గమనార్హం.



రాజమహేంద్రవరంలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ప్రకాశంనగర్ సీఐ బాజీలాల్

నేటి నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో
బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్‌లెవెల్ అధికారుల(బీఎల్‌వో)కు శిక్షణ కార్యక్రమం ఈనెల 9 నుంచి 17వతేదీ వరకూ నిర్వహించనున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమాక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ శిక్షణకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 1581 మంది బూత్ లెవెల్ అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.



ఈ ఎసరు.. ఏంటీ?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రూ.5.80కే.. బిర్యానీ, వైట్ రైస్, కూర, పచ్చ డి, సాంబారు, మజ్జిగతో భోజనం ఎక్కడైనా దొరుకుతుందా?.. అదీ తిన్నంత!.. ఒక్క ఇడ్లీ కూడా.. అంతెందుకు మజ్జిగ కూడా ఆ ధరకు రావడం అసంభవమైన ఈ రోజుల్లో ఆ డబ్బు లకు బిర్యానీ? అని రక్కున ప్రశ్న నోటి నుంచి బయటకు వస్తోందా?.. అయితే ఇది చదవండి మరి!

- రూ.5.80కే మెనూ సాధ్యమా?
- మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కి వండి వడ్డించాలని ప్రధానోపాధ్యాయుల హుకుం
- గగ్గోలు పెడుతున్న ఎండీఎం కార్మికులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ శ్రీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథక కార్మికులను(ఎండీఎం) ఆందోళనకు గురి చేస్తోంది. ఆ రోజున హాజరయ్యే తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తమకు విందు భోజనం ఏర్పాటు చేయాలని ఎండీఎం కార్మికులను ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే ఆదేశించారు. టీలు, కాఫీలు మామూలుగానే అనుకొని అందించాలట. దీంతో తమకు ఈ 'ఎసరు' ఏంటని ఆ కార్మికులు వాపోతున్నారు.

● శ్రమ దోపిడీ

'నా కులం ఏంటో తెలుసా.. జిల్లా అధికారులకు నేను ఎంత చెప్తే అంత' ఓ కార్మికురాలిపై ఓ ప్రధానోపాధ్యాయుడు పారేసుకున్న మాటలు.. 'చెప్పు తీసుకుని కొడతా, స్కూలు నాదే.. పీకిపారేస్తాం'.. ఇది ఒక హెచ్‌ఎం 20 ఏళ్ల నుంచీ చేస్తున్న ఓ పెద్ద వయసు కార్మికురాలికి ఇచ్చిన వార్నింగ్. వీళ్లే కాదు చాలా మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు కనీసం కనికరం లేకుండా.. మహిళలని కూడా వీసమెత్తు గౌరవం లేకుండా ఆ కార్మికులపై రోజూ దర్పం ఒలకబోస్తున్నారు. అన్ని మాటలు పడుతూ పిల్లలకు వండి వార్చుతున్నా.. తాము మాత్రం పస్తులుండే పరిస్థితి ఉందని కార్మి కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉద్యోగ భద్రత కరువైందని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌కి రూ.5.80కే షడ్రుచులతో భోజనం పెట్టాలని హుకుం జారీ చేశారు. బిల్లు ఎప్పుడు చెల్లిస్తారో కూడా తెలియదు. దీంతో ఎండీఎం మహిళా కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. సాధ్యమైతే ఆ డబ్బులకు బయటి నుంచి భోజనాలు ఆ ధరకు తెప్పించుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే రాగిజావ, గుడ్లు వేపినందుకు పైసా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కనీసం కూలీ కూడా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6వేల వరకూ ఎండీఎం కార్మికులు(ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు) ప్రతిరోజూ వేలాదిమంది పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. బియ్యాన్ని ప్రభుత్వం ఇస్తుండగా నూనె, కూరగాయలు, గ్యాస్, దినుసులు, ఉప్పు అన్నీ ఎండీఎం కార్మికులే కొనుగోలు చేసుకోవాలి. ఇవాళ మార్కెట్లో ధరలతో పోలిస్తే నెలకు పైసా కూడా మిగ లడం కష్టంగా ఉంది. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.5.80 పైసల చొప్పున చెల్లిస్తుంది. ఒక్కోసారి తమకు గౌరవ భృతిగా ఇస్తున్న డబ్బులు సైతం వంటకే ఖర్చు పెట్టాల్సి వస్తోందని అంటున్నారు. ఈక్రమంలో ఎండీఎం కార్మికులకు కనీసం రోజు కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రమాదాలు జరిగినా పట్టించుకునే వారు లేరు. వారి దీన స్థితిపై ఈనెల 1న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. కార్మికులకు ప్రమాదాలు జరుగుతున్నాయని.. రాజమహేంద్రవరంలోని రెండు ఘటనలు దానిలో పేర్కొన్నారు. ఇంకేముందు.. ఓ స్కూలు హెచ్‌ఎం ఆ కార్మికురాలితో తనకేమీ కాలేదని ఓ కాగితం రాయించుకొని కలెక్టర్‌కి పంపించారని తెలిసింది. ఇది శ్రమ దోపిడీకి ఒక ఉదాహరణ మాత్రమే.

● విందు భోజనం పెట్టాలని ఆదేశం

ఎండీఎం భోజన పథకంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీల పేరుతో మహిళా కార్మికులు వండి వడ్డిస్తున్నారు. పథకం తొలినాళ్ల నుంచీ ఇప్పటికీ పని చేస్తున్న వాళ్లు ఉన్నారు. పిల్లలతో ఏదో తెలియని బంధం ఏర్పడి కొందరు.. ఎప్పటికైనా తమ శ్రమను ప్రభుత్వం గుర్తిస్తుందని మరికొందరు అలా రోజులు నెట్టుకొస్తున్నారు. కొందరు ప్రధానో పాధ్యాయులు వీరిపై దయ మాట అటుంచితే హీనంగా చూస్తున్నారు. ఇవన్నీ దిగమింగుకుంటూ పని చేస్తున్నారు. ఇప్పుడు ఈనెల 10న నిర్వ హించే మెగా పేరెంట్స్ మీటింగ్‌కి బిర్యానీతోపాటు నాలుగైదు రుచులతో పేరెంట్స్‌కి కూడా విందు భోజనం పెట్టాలని ఆదేశించారు. ఆ భోజనాలకు రూ.5.80 చొప్పున దయ కలిగినప్పుడు చెల్లిస్తారట. అంటే ఓ 50మందికి వడ్డిస్తే రూ.300 వస్తోంది. ఇలా సాధ్యమేనా.. సమంజసమేనా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు సుద్దులు చెప్పే ఉపాధ్యాయులు రూ.5.80కే విందు భోజనం ఎలా వండాలో తమకు చెప్పాలని కోరుతున్నారు. కలెక్టర్ కల్పించుకోవాలని వేడుకొంటున్నారు.



టెన్షన్‌లోను..!

కార్పొరేషన్ రుణాలకు ఎదురుచూపులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే స్వయం ఉపాధి రుణ యూనిట్లకు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ తరహా రుణాలను ఐదేళ్లు పూర్తిగా నిలిపి వేసింది. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్ రుణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అంతా సంబరపడ్డారు. తీరా రుణాలు మంజూరైనట్టే అయి నిలిచిపోవడంతో అసలు వీటిని ఎప్పుడు తిరిగిస్తారో తెలియక పడిగాపులు కాస్తున్నారు .ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రుణాలకు వేలల్లో పోటీ నెలకొనగా.. యూనిట్లు వందల్లోనే ఉండడంతో ఎక్కడి కక్కడ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో యూనిట్ల సంఖ్య మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరడంతో తదుపరి నిర్ణయం కోసం రుణాలు మంజూరు చేయకుండా నిలిపివేశారు. ఇప్పటికే రెండు నెలలు దాటడంతో అసలెప్పుడు వీటిని ప్రభుత్వం మంజూరు చేస్తుందోనని అంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 5,137 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయగా.. అదే స్థాయిలో మళ్లీ కోటా పెంచవచ్చని భావిస్తున్నారు.

గత ఐదేళ్లూ.. రుణ ఊసేలేదు..

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు కార్పొరేషన్లను అటకెక్కించేసింది.నిరుద్యోగులకు రుణ సదుపాయం కల్పించకుండా వారిని ఇబ్బంది పెట్టింది.2019నాటికి మునుపటి టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు పంచడానికి సిద్ధంగా ఉన్న రుణాలు, పనిముట్లను సైతం మూలనపారేసింది. ఒకరకంగా చెప్పాలంటే ఐదేళ్ల పాటు ఈ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయకుండా నిరుద్యోగులను ఇబ్బంది పెట్టింది. ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో మళ్లీ బీసీ,కాపు, ఎస్సీ,ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు.

మంజూరు చేసిన యూనిట్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల కింద భారీగా స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 2,405 రుణ యూనిట్లను మంజూరు చేశారు. వీటి కింద ఫ్లవర్‌బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్‌ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వంచర్ టూరిజం, సబ్బులతయారీ, మొబైల్ కార్ వాష్, బేకరీ, ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో,కారు, గూడ్స్ ట్రక్‌వంటి వ్యాపారాలు చేసుకునేలా యూనిట్లు నిర్ణయిం చారు. ఆయా వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ మేరకు సామాజికవర్గాలవారీ దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది.

యూనిట్లు పెంచే యోచన..

ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ పథకం అమల్లోకి రావడంతో దరఖాస్తుదారులు వేలల్లో పోటె త్తారు. ఎంపికకాని వేలాదిమంది పేద యువత, నిరుద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు. అటు ఎమ్మెల్యేల అనుచరులు సైతం అర్హత ఉన్న తమవారికి కూడా యూనిట్లు రాలేదని విన్నవించారు. దీంతో నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. యూనిట్లు పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. ఆ తర్వాత జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ల్లోను జిల్లాల అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభుత్వంలో జరిగింది. దీంతో ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తిం పజేయాలని సమాచారం పంపించారు. అదనపు యూనిట్లు మంజూరు చేస్తామని రెండునెలలు దాటుతున్నా ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో అప్పటికే ఎంపికైన లబ్ధిదారులు, కొత్త యూనిట్లు వస్తాయని ఆశతో ఉన్న వారు నిరీ క్షిస్తూ కూర్చున్నారు. అసలు వీటిని ఎప్పుడు విడుదల చేస్తారంటూ జిల్లాల్లో ఆయా శాఖల అధికారులను అదే పనిగా సంప్రదిస్తున్నారు. అయితే యూనిట్ల పెంపు ఖాయమని, అది ఎప్పుడనేది తమకు కూడా సమాచారం లేదని జవాబు ఇస్తున్నారు.ప్రభుత్వం మాత్రం నియోజకవర్గాల వారీగా ఆయా సామాజికవర్గ అవసరాలను బట్టి త్వరలో కోటా నిర్ధారించి యూనిట్ల సంఖ్యను పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల తరఫున కోటా కాకుండా ఎక్కువమంది సామాన్య యువతకు యూనిట్లు అందేలా సంఖ్యను నిర్ధారించి త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

- రెండు నెలల కిందట నిలిపివేత
- 5,137 యూనిట్లు మంజూరు
- 45,765 దరఖాస్తులు రాక
- ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి
- సీఎం దృష్టికి సమస్య
- పెంపు యోచనలో నిలిపివేత
- రెండు నెలలైనా తేలని నిర్ణయం



వేలల్లో దరఖాస్తులు

యూనిట్లు వందల్లో ఉంటే దరఖా స్తుదారులు వేలల్లో వచ్చారు. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీ పడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడలో రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454 దరఖాస్తులు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోన సీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీపడ్డారు. ఈడ బ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మం జూరు చేయగా 6 వేల మంది దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూ రవగా 5,497, కోనసీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తులు చేశారు.

సొసైటీలకు త్రీమన్ కమిటీల
నియామకం

రాజమహేంద్రవరం, జూలై8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాలు (పీఏసీఎస్)లకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. జిల్లాలో 107 సొసైటీలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం 22 సంఘాలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఒకరు చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. కామరాజుపేట పీఏసీఎస్ కమిటీకి చైర్‌పర్సన్‌గా పిర్ల వెంకటేశ్వరరావు, సభ్యులు గంటా వీరబాబు, యడిబిల్లి కొండబాబు నియమితులయ్యారు. కడియం సొసైటీకి చైర్‌పర్సన్‌గా వెలుగుబంటి రఘురామ్, సభ్యులుగా ముద్రగడ సూర్యకాంతరావు, తుమ్మెద వరహాలరాజు, కడియపులంక సొసైటీకి చైర్‌పర్సన్‌గా గట్టి నరసయ్య, సభ్యులుగా కొటికలపూడి వెంకటేశ్వరరావు, అంజూరి వెంకట రామారావు, వేమగిరి సొసైటీ కమిటీ చైర్మన్‌గా వెలుగుబంటి వెంకటాచలం, సభ్యులుగా పులుపు వెంకటరమణమూర్తి, పీతాని శివరామ కృష్ణ, హుకుంపేట సొసైటీ కమిటీ చైర్మన్‌గా బొప్పన శ్రీనివాస్, సభ్యులుగా సోము వినాయక్, మద్దిపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. రాజవోలు సొసైటీ కమిటీ చైర్మన్‌గా వల్లూరి చెంచు రాజు, సభ్యులుగా పెంటగట్ల మణికంఠ, మద్దిరెడ్డి రాంబాబు, తొర్రేడు సొసైటీ కమిటీ చైర్మన్‌గా దండమూడి బాపినీడు, సభ్యులుగా నల్లిరి రామ కృష్ణ, విన్నకోట శేషాచార్యులు, కాతేరు సొసైటీ కమిటీ చైర్మన్‌గా నున్న బాబూరావు, సభ్యులుగా ఈదల రాఘవబాబు, సోముగంగాధర్ నియమితులయ్యారు. కొవ్వూరు శ్రీరామ పీఏసీఎస్ కమిటీ చైర్‌పర్సన్‌గా కంఠమణి రామకృష్ణారావు, సభ్యులుగా ఉప్పులూరి ప్రసాద్, దండు బోయిన మురళీకృష్ణ, పశివేదల సొసైటీ కమిటీ చైర్మన్‌గా గారపాటి రామచంద్రారావు, సభ్యులుగా వేములపల్లి రత్న రాజేంద్ర, గూన పరెడ్డి శ్రీనివాసరావు, కాపవరం సొసైటీ కమిటీ చైర్మన్‌గా సుంకర సత్తిబాబు, సభ్యులుగా వెంపటి సత్యనారాయణ, మడిచర్ల నాగవీరభద్రరావు, దొమ్మేరు సొసైటీ కమిటీ చైర్మన్‌గా గారపాటి శ్రీవెంకటకృష్ణరామారావు, సభ్యులుగా సిద్ధగాని సావిత్రమ్మ, తోట ముద్దుల బాబు, అరికిరేవుల సొసైటీ కమిటీ చైర్మన్‌గా చావా రామకృష్ణ శ్రీనివాసరావు, సభ్యులుగా మంకిన రామకృష్ణారావు, దాసరి కృష్ణ నియమితులయ్యారు. మద్దూరు సొసైటీ కమిటీ చైర్మన్‌గా నాయుడు వీర్రాజు, సభ్యులుగా ఆకుల నాగరాజు, పిల్లి సత్యనారాయణ, మార్కొండపాడు సొసైటీ కమిటీ చైర్మన్‌గా మద్దిపాటి వీరరాఘవులు, సభ్యులుగా ఉప్పులూరి ఆదినారాయణ, బొడ్డు వీరేంద్రచౌదరి, చిక్కాల సొసైటీ కమిటీచైర్మన్‌గా యంత్రప్రగడ అబ్బులు, సభ్యులుగా కేతా సత్యనారాయణ, జక్కుల గంగరాజు నియమితులయ్యారు. కలవలపల్లి సొసైటీ చైర్మన్‌గా అబ్బూరి సీతారామాంజనేయులు, సభ్యులుగా గర్రే గురుప్రసాద్, నరమామిడి పెద్దగోవింద్, మలకపల్లి సొసైటీ చైర్మన్‌గా జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సభ్యులుగా సిద్ధా సీతారామకృష్ణ, బోడపాటి గంగరాజు, అన్నదేవరపేట సొసైటీ చైర్మన్‌గా గొరిజాల వెంకటప్రసాద్, సభ్యులుగా వెలుగుబంటి బాలకృష్ణ, చేవూరి బంగార్రాజు, తాడిపూడి సొసైటీ చైర్మన్‌గా నామా వెంకటసుబ్బారావు, సభ్యులుగా నామారంగనాయకులు, గొంటి వెంకట రమేష్ నియమితులయ్యారు. రాగోలపల్లి సొసైటీ చైర్మన్‌గా అనపర్తి నాగ వెంకట దుర్గారామకృష్ణప్రసాద్, సభ్యులుగా చలపతి శివరామకృష్ణ, బాలం చంద్రరావు, కురుకూరు సొసైటీ చైర్మన్‌గా యలమాటి భాస్కరరావు, సభ్యులుగా బొల్లం నాగేశ్వరరావు, నూతలపాటి గాంధీ నియమితులయ్యారు.

- 22 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలు

గరం గరంగా..





దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సంఘం సమీక్ష సమావేశంలో పాల్గొన్న చైర్మన్ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు బత్తుల, నలమిల్లి, ఎమ్మెల్సీ సోము సమావేశానికి హాజరైన పలు శాఖల అధికారులు

- రాజమహేంద్రవరంలో 'దిశ' సమీక్ష సమావేశం
- కేంద్ర పథకాలపై ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి రివ్యూ
- అజెండాలో 10 అంశాలపై చర్చ.. మిగిలిన 30 అంశాలు వాయిదా
- కొన్ని లెక్కలు తప్పుల తడకలని ప్రశ్నించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ
- పథకాలపై క్షేత్రస్థాయి అవగాహన తప్పనిసరన్న ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సంఘం(దిశ) సమీక్ష సమావేశం మంగళవారం ఆద్యంతం గరంగరంగా సాగింది. నగరంలో దిశ కమిటీ చైర్మన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ పి.ప్రశాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత జడ్పీ సీఈవో లక్ష్మణరావు సమావేశ వివరాలు వెల్లడించారు. ప్రతి మూడునెలలకు ఒకసారి దిశ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశం రెండోదని, ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి సమావేశమని చెప్పారు. అజెండాలో మొత్తం 40 అంశాలు ఉన్నట్టు తెలిపారు. అనంతరం చైర్మన్ పురందేశ్వరి మాట్లాడారు. కేంద్రప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు చేరువ కావాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు, ఇంకా ప్రతిపాదనలు, అవసరాలను చర్చించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించేందుకే ఈ సమీక్ష చేస్తున్నామన్నారు. తొలుత మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకం, జల్‌జీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి తాగునీరు, పసల్ బీమా అమృత్ పథకం, పింఛన్లు, క్యాన్సర్ బాధితుల లెక్కలు, క్షయ నివారణ, పీఎం సూర్యఘర్ పథకం, అర్టికల్చర్‌లో పండ్లతోటలు, కోకో, కొబ్బరి తదితర పంటలు, పలు పనుల రిపోర్టును అధికారులు వివరించారు. దీనిపై చైర్మన్ పురందేశ్వరి స్పందించారు. గ్రామీణ ఉపాధి హామి పథకంలో పనిదినాలు పెంచాలని, డ్రైయిన్‌ల నిర్మాణం అంచనా వ్యయాన్ని రూ.లక్ష నుంచి పది లక్షలకు పెంచాలని, రహదారుల వెడల్పులు పెంచాలని కేంద్రప్రభుత్వాన్ని కోరతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్ పనులు సక్రమంగా జరగలేదని వీటిపై విచారణ జరపాలన్నారు. సేంద్రియ వ్యవసా యం ద్వారా పండించిన పంటలకు సర్టిఫికేషన్ ఇవ్వాలని, వీటికి మెరుగైన ధర లభించడంకోసం మార్కెట్ యార్డులను ఈనామ్‌తో అనుసంధానించాలన్నారు. క్షయ నియంత్రణ కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ఒక టీబీ రోగిని దత్తత తీసుకోవాలన్నారు. క్షయమిత్రగా ఒక టీబీ పెషెంట్‌ను దత్తత తీసుకున్న కలెక్టర్ ప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఏడాదికి నాలుగు దిశ సమావేశాలు జరుగుతాయని, కచ్చితంగా జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. అనర్హులకు పింఛన్ల మంజూరులో చేసిన నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ జిల్లాలో గతంలో మొక్కలు నాటేకార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టారని కానీ చాలాచోట్ల ఆ మొక్కలు, చెట్లుగాని లేవన్నారు. ఒక్క విజ్జేశ్వరంలో మాత్రమే కొబ్బరి మొక్కలు పెరిగి ఏడాదికి రూ.లక్ష ఆదాయం వస్తోందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హెల్త్ సర్వే విషయంలో డోర్ టు డోర్ జరగడంలేదన్నారు. పొరపాట్లను సరిదిద్దుకోవాలని మెరుగైన సేవలు ప్రజలకు అందాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాట్లాడుతూ తన నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్ పథకంలో అవకతవకలు జరిగాయన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో తాగునీటి సమస్య ఉందని, పాలచర్ల నుంచి పైప్‌లైన్ వేస్తే పరిష్కారవుతుందన్నారు. తన నియోజకవర్గంలో కొన్ని ముఖ్యమైన పనులకు సంబంధించి జిల్లా అధికారుల నుంచి సమాచారం ఉండడం లేదని ప్రొటోకాల్ కూడా పాటించడంలేదన్నారు. సీతానగరం ఎంపీపీ జ్యోత్స్న, కడియం మండలం మాధవరాయుడుపాలెం సర్పంచ్, పెరవలి ఎంపీపీ కేఎస్ఆర్ ప్రసాద్, పలు సమస్యలు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వేణుమాధవరావు, నగరపాలక సంస్థ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్, పలు శాఖల జిల్లా అధికారులు, సీతానగరం, పెరవలి, కడియం, ఎంపీపీలు, చిట్యాల, కేశవరం, ధర్మవరం, ఎంఆర్‌పాలెం పంచాయతీ సర్పంచ్‌లు, దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





సెల్..రేగితే.. చెరసాలే!

చేతిలో సెల్‌ఫోన్ ఉంది. సోషల్ మీడియాలో 'సెల్'రేగిపోదాం.. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాలో రెచ్చిపోదాం. అసభ్యకర, అసత్య పోస్టులు పెడుతూ అలజడి రేపుదాం అనుకునే వారికి షాక్ ఇస్తున్నారు కాకినాడ జిల్లా పోలీసులు. ఇష్టానుసారంగా తప్పుడు సందేశాలను, సంకేతాలను ప్రజల మధ్యకు పంపుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని కటకటాల వెనక్కి నెడుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ.. ప్రచార పైశాచికానందాన్ని పొందుతున్న వారి సరదా తీర్చేస్తున్నారు. ఇటీవల జరిగిన అరెస్టులే ఓ హెచ్చరిక అనుకోవాలని వార్నింగ్ ఇస్తున్నారు.

- సోషల్ మీడియాలో రాంగ్ పోస్టులు వద్దు
- అసభ్యకర, అసత్యప్రచారాలు చేస్తే ఊరుకోం
- పోస్టులు పెట్టే ముందు ఆలోచించండి
- తప్పుడు పోస్ట్ ఫార్వర్డ్ చేసి ప్రమాదంలో పడొద్దు
- అడ్మిన్లూ.. రాంగ్ పోస్టుల బాధ్యత మీదే..
- కాకినాడ జిల్లా పోలీసుల హెచ్చరిక.. విస్తృత ప్రచారం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విశాఖలో జూన్ 21న జరిగిన ప్రపంచ యోగా దినోత్సవం-2025 కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలించపరిచేలా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్' వేదికగా, అవమానకరంగా పోస్టును విడుదల చేసి దాన్ని షేర్ చేసిన ఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో జనసైనికులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అవమానపరుస్తూ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా అవమానకరంగా పోస్టు పెట్టిన ఈ కేసుపై కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆ పోస్టులు ఎవరు పెట్టారు? వారి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను నియమించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపారు. దీనిలో భాగంగా జూన్ 24న వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.యానం ప్రాంతానికి చెందిన కర్రి వెంకటసాయి వర్మ (ఏ2), మచిలీపట్నం మండలం వలందపాలెం గ్రామానికి చెందిన పాముల రామాంజనేయులు(ఏ3), హైదరాబాద్ సరూర్‌నగర్ సింగరేణి కాలనీకి చెందిన షేక్ మెహబూబ్(ఏ4) ఉన్నారు. ఇదే కాదు.. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా పరిధిలో మరెన్నో జరుగుతున్నాయి.



వాయు వేగాన్ని మించి..

'నిజం గుమ్మం దాటే లోపు.. అబద్ధం ఊరంతా చుట్టేసి వస్తుందన్న' చందంగా ఉంది సోషల్ మీడియా తీరు. మంచి విషయాలు పక్కన పెడితే.. అసత్య ప్రచారాలు అధికంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా నేడు ఒకరిపై ఒకరు దుమ్మెత్తుకొని పోసుకునే ఆయుధంగా మారింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునేందుకు వీలుగా తయారైంది. ఒకరు పోస్టు పెట్టడం, దానికి మరొకరు కౌంటర్‌గా కామెంట్ చేయడం, దాన్ని మరికొందరు లైక్ చేయడం, షేర్ చేయడం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా, ఎక్స్.. ఇలా అన్ని ప్లాట్‌ఫాంలలోనే హల్‌చల్ చేయడం, వివాదాలకు దారి తీయడం ఇలా వ్యవహారం నడుస్తోంది. ఎక్కడైనా చిన్న సంఘటన జరిగితే చాలు వెంటనే వీడియో/ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం నేడు కొందరికీ అలవాటుగా మారింది. అసలు అందులో వాస్తవమెంత? ఎవరు తీశారు? ఇది షేర్ చేయడం వల్ల ఇబ్బందులేమైనా ఎదురవుతాయా? అనే విషయాలను ఆలోచించకుండానే కొందరు అసభ్యకర, అవమానకర పోస్టులను షేర్ చేసి ఇబ్బందులు తెచ్చుకుంటున్నారు.

సమస్యలు తెచ్చుకోవద్దు

కాకినాడ జిల్లా ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి. సోషల్ మీడియాను ఇష్టారీతిన వాడి సమస్యలు కొని తెచ్చుకోవద్దు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టే ముందు జాగ్రత్త వహించాలి. నిర్ధారించుకోకుండా ఏమెసేజ్ ఫార్వర్డ్ చేయొద్దు. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే జైలుకు వెళ్తారు. తప్పుదోవ పట్టించే ఫొటోలు, వీడియోల జోలికి వెళ్లొద్దు. నిజనిర్ధారణ లేకుండా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు.

- బిందుమాధవ్, ఎస్పీ కాకినాడ జిల్లా

షేర్ చేసినా నేరమే..

సోషల్ మీడియాలో అనుచితమైన సందేశాలను పోస్టు చేయడమే కాదు.. షేర్ చేసినా తీవ్ర తప్పిదంగా పరిగణిస్తున్నారు. పోస్టు చేసిన వ్యక్తితోపాటు.. ఆ పోస్టు షేర్ చేసిన వారి సోషల్ మీడియా ఐడీలను గుర్తిస్తున్నారు. మెసేజ్ మొదట ఎక్కడినుంచి వచ్చింది? దాన్ని ఎవరెవరు షేర్ చేశారు? ఏ వాట్సాప్ గ్రూపులో తిరుగుతోంది? దాని అడ్మిన్ ఎవరు? ఎందుకు పోస్టు చేశారు? ఇలా రకరకాలుగా ఆరా తీస్తున్నారు. సిస్టమ్ ఐపీ నెంబర్ ఆధారంగా ఏ కంప్యూటర్ లేదా ఏ మొబైల్ నుంచి ఆ మెసేజ్ బయటకు వచ్చింది.. వంటి విషయాలను ప్రత్యేక ఐటీ నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించి సోషల్ మీడియాలో పైశాచిక ఆనందం పొందుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. కటకటాల వెనక్కి నెడుతున్నారు. జిల్లాలోని సోషల్ మీడియాను ప్రభావితం చేసేలా రెగ్యులర్ పోస్టింగ్‌లు చేస్తున్న వారిపైనా ప్రత్యేక నిఘా పెడుతున్నారు. గ్రూప్ అడ్మిన్‌లు ఎవరు? వారి నేపథ్యమేంటి? క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఐటీ చట్టాల ప్రకారం శిక్షలు..



ముఖ్యంగా ఎదుటి వారి వ్యక్తిగత విషయాలు, జీవితాలు, వారిని కించపరుస్తూ, అసభ్యపదజాలంతో దూషిస్తూ, అవమానకరంగా చిత్రీకరిస్తూ, వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ ప్రవర్తిస్తే 66డీ ఐటీ యాక్ట్, 67ఏ ఐటీ యాక్ట్, 66ఈ ఐటీ యాక్ట్‌ల ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేస్తారు.

- 66డీ ఐటీ యాక్ట్ : కంప్యూటర్‌ను ఉపయోగించి డిజిటల్ మార్గాల ద్వారా ఎవరినైనా మోసం చేస్తే ఈ చట్టం ద్వారా పోలీసులు అరెస్టు చేస్తారు. ఉదాహరణకు నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌ను సృష్టించడం, ఆన్‌లైన్ ఖాతాల ద్వారా అనధికార మోసాలకు పాల్పడితే ఈ సెక్షన్ వర్తింపజేస్తారు. మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు.
- 67(ఏ) ఐటీ యాక్ట్ : సెల్‌ఫోన్లలో అసభ్యకరమైన వీడియో సందేశాలు పోస్టు చేస్తే తీవ్రమైన నేరంగా ఈ యాక్ట్‌లో పరిగణిస్తారు. ఇందులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా విధిస్తారు.
- 66ఈ ఐటీ యాక్ట్ : ఎవరినైనా ఉద్దేశపూర్వకంగా, వారి అనుమతి లేకుండా వారి ఫొటోలను అసభ్యకరంగా చిత్రీకరించి అవమానకరంగా పోస్టులు పెట్టిన వారిపై ఈ సెక్షన్ ద్వారా చర్యలు తీసుకుంటారు. జైలు శిక్ష, జరిమానా రెండూ ఉంటాయి.



ముచ్చటగా ముగ్గురు!

ముగ్గురు విద్యార్థులు... ఒక టీచరు... ఈ చిత్రంలో కనిపిస్తున్నది అదే.... కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్తపల్లి స్పెషల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత పరిస్థితి ఇదీ... ఇక్కడ గతంలో వందలాది మంది విద్యార్థులు చదువుకున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 200-250 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. టీచర్లు కొత్తపల్లి మండలం బదిలీ కోరుకొంటే ఈ పాఠశాలలో పని చేసేందుకు సుముఖత వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి తారుమారైంది. ఒకటో తరగతిలో ముగ్గురే పిల్లలుండగా ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

'ప్రసాద్' పథకంలో అన్నవరం ఆలయ అభివృద్ధి

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ ప్రదేశాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం అమలు చేస్తోంది. దీనిద్వారా కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నిధులతో ఆలయ పరిసరాల్లో చేపట్టనున్న పనులకు సంబంధించిన టెండర్లను వచ్చే వారం ఖరారు చేయనున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ విషయాన్ని ఎంపీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



డొక్కా సీతమ్మ విగ్రహం వద్ద ఆమె బంధువులు

డొక్కా సీతమ్మ విగ్రహ సందర్శన

సర్పవరం జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు ఉపాధ్యాయురాలు ముత్య వెంకటరామలక్ష్మి ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని మంగళవారం ఆమె బంధువులు సందర్శించారు. అందులో ఒకరైన నరసింహమూర్తి మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా పేర్గాంచిన సీతమ్మ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహ దాత రామలక్ష్మి, హెచ్ఎం గాయత్రి, ఇన్‌చార్జి పి.శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేతలు తుమ్మల, పంతం

- గంజాయికి కేరాఫ్ దాడిశెట్టి రాజా
- సీటు కోసం పవన్ చుట్టూ జక్కంపూడి ప్రదక్షిణలు
- జనసేన నేతలు తుమ్మల, పంతం

పిఠాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి ఉంటుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, వేగుళ్ల లీలాకృష్ణలతో కలిసి మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతల వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఓడిపోయి పనిలేకుండా ఉన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఇక్కడకు పంపించి అవాకులు, చవాకులు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు జక్కంపూడి రాజా, దాడిశెట్టి రాజా.. జగన్ వద్ద మార్కులు కోసం వారు ఇచ్చిన స్క్రిప్ట్ చదివారని విమర్శించారు. తునిలో దాడిశెట్టి గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఆరోపించారు. గతంలో సీటు కోసం పవన్‌కల్యాణ్ కార్యాలయం చుట్టూ తిరిగిన రోజులను జక్కంపూడి మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో నిస్వార్థంగా ప్రజలు కోసం పనిచేస్తున్న వ్యక్తి పవన్‌కల్యాణ్ అని అన్నారు. ఎమ్మెల్యే అయిన ఏడాదిలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ చేసిన అభివృద్ధిపై అవాకులు చవాకులు మాట్లాడిన వైసీపీ నేతలు చర్చకు రావాలని వారు సవాల్ చేశారు. సమావేశంలో గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఊటా నానిబాబు, జనసేన మహిళా విభాగం కో-ఆర్డినేటర్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 9 మందికి కారుణ్య ఉద్యోగాలు



ఉద్యోగ నియామకాలు పొందిన వారితో ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలో పనిచేస్తూ సహజ మరణాలతోపాటు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 9 మందికి కండక్టర్ గ్రేడ్-2 కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి, కాకినాడ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈ నియామకపత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరం డిపోలో ముగ్గురు, రావులపాలెం డిపోలో ఒకరు, కాకినాడ డిపోలో ముగ్గురు, రామచంద్రపురం డిపోలో ఒకరు ఉద్యోగాలు పొందారని జిల్లా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, రావులపాలెం, రాజోలు, ఏలేశ్వరం, కాకినాడ, రామచంద్రపురం, తుని డిపోలు, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తూ సహజ మరణం, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు ఈ కారుణ్య నియామకాలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

ఖాళీస్థలాల టెండర్ల ప్రక్రియపై అవగాహన సదస్సు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించిన 11 ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వడానికి సంబంధించిన టెండరు ప్రక్రియపై మంగళవారం రాజమహేంద్రవరంలోని ట్రైనింగ్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం శివరామ్ (విజయవాడ), జిల్లా ఆర్టీసీ అధికారి వైఎస్ఎన్ మూర్తి, కాకినాడ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఎన్.కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో 21 మంది ఔత్సాహిక వ్యాపారులు పాల్గొన్నారని, అనుమతించిన వ్యాపారాలు పదిహేనేళ్లపాటు చేసేందుకు వారికి స్థలాల వివరాలను తెలియజేశామని జిల్లా ఆర్టీసీ అధికారి తెలిపారు.

1,065 లీటర్ల స్పిరిట్ స్వాధీనం

- 10 మంది నిందితుల అరెస్టు
- స్పూరియాస్ లిక్కర్ కేసును ఛేదించిన ఎక్సైజ్ పోలీసులు

కాకినాడ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనరు చైతన్య మురళి ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరులో స్పూరియాస్ లిక్కర్ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కె.రవితేజ, కానిస్టేబుళ్లు జి.హనుమంతరావునాయుడు, ఎం.భవనారాయణలను చైతన్య మురళి సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసి 1,065 లీటర్ల స్పిరిట్, అధిక మొత్తంలో విస్కీ సీసాలు, ఒక ఇరాస్ కేప్ సీలింగ్ మిషన్, 6000 ఖాళీ సీసాలు, క్యాప్‌లు, ఒక కిలో కేరమిల్, ఒక ఆటోను స్వాధీ నపర్చుకున్నట్టు డీసీ వివరించారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న స్పిరిట్‌ను హైదరాబాద్ నుంచి తెచ్చినట్టు గుర్తించి ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్ పంపించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై సమాచారమివ్వాలి

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అవినీతిపై సమాచారాన్ని తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని అవినీతి నిరోధక శాఖ రాజమహేంద్రవరం రేంజ్ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. తూర్పు గోదావరికి సంబంధించి 9440446161, కాకినాడ 8332971041, కోనసీమ 9440446163 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా, ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నా తెలియజేయాలన్నారు. లంచం తీసుకోవడమే కాకుండా ఇవ్వడం కూడా చట్ట ప్రకారం నేరమేనని ఆయన పేర్కొన్నారు.

గుబ్బాలమ్మకు మంత్రి పూజలు



గోపవరంలో మంత్రి దుర్గేష్‌కి ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

నిడదవోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపవరంలో వేంచేసి వున్న గుబ్బాలమ్మ వారికి మంగళవారం ఆషాఢ మాసం సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు రఘుకుమార్ శర్మ ఆశీర్వచనాలు అందించారు. ఉదయం నుంచి మహాలక్ష్మి హోమం, మహా పూర్ణాహుతి, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బెదిరిస్తే చూస్తూ ఊరుకోం

- ముద్రగడ క్రాంతి ఫైర్



పెదశంకర్లపూడిలో మీడియాతో మాట్లాడుతున్న క్రాంతి

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో తనకు సహకరించేవారిని బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె ముద్రగడ క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె కాకినాడ జిల్లా పెదశంకర్లపూడిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెదశంకర్లపూడి సర్పంచ్ సూర్నీడి నాగరత్నం స్వగృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ తన అనుచరులు, మద్దతుదారులను సోదరుడు, ప్రత్తిపాడు వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. తనకు జనసైనికులు, నాయకులు సహకరిస్తున్నారని అందువల్లే బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. సమావేశంలో కూటమి, జనసేన నాయకులు సూర్నీడి సురేష్‌కుమార్, బొంకు నాని, నల్లల రామకృష్ణ, మేకల కృష్ణ, కోరుకొండ అప్పారావు, సీరం శ్రీను, సూర్నీడి వీరబాబు, కుప్పిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన ఒంటరి మహిళను అదే గ్రామానికి చెందిన మర్రి శోభనబాబు లైంగికంగా వేధిస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించి విచారిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఒంటరి మహిళ సోమవారం తన ఇంట్లో వంట చేస్తుండగా శోభనబాబు వెళ్లి అత్యాచారం యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఆమె తలకు దెబ్బతగిలింది. దీంతో తాడేపల్లిగూడెంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. సోమవారం సాయంత్రం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి ఒకరి మృతి

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన ఉప్పులూరి గోపాలకృష్ణ (47) ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుమందు సేవించాడు. దీంతో ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం గోపాలకృష్ణ వ్యవసాయ కూలీగా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్యసత్యవతి, కుమార్తె ఉన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు!

- రాజవొమ్మంగి మండలంలో ఫారం పాండ్ నిధుల్లో భారీ అవకతవకలు
- ఉపాధి శ్రామికుల ఖాతాల్లో రూ.70,190 జమ
- మేటు హస్తం ఉన్నట్టు గుర్తించిన అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో ఫారం పాండ్ నిధుల్లో భారీ అవకతవకలు జరిగాయి. పనులు చేయకుండానే బిల్లులు చేసుకొని ఆడిట్ ఉందని హడావుడిగా జేసీబీతో పనులు చేస్తుండగా ప్రజలు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫారం పాండ్ పనులు కింద్ర పంచాయతీ ముంజవరప్పాడులో ఈ ఏడాది మార్చిలో కాకర ఎర్రయ్య అనే వ్యక్తి భూమిలో జరిగాయి. అయితే ఈ పనులను ఉపాధి శ్రామికులతో చేయించకుండానే అధికారులు సంబంధిత శ్రామికుల ఖాతాల్లో జమచేశారు. ఆ సొమ్ముల్లో రోజుకు రూ.100 తమ వద్ద ఉంచి మిగిలిన సొమ్ములను బలవంతంగా సంబంధిత మేటు తీసుకున్నాడని ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బయపడిన సదరు వ్యక్తి సామాజిక తనిఖీ జరుగుతుందేమోనని హడావుడిగా ఆదివారం ఆ భూమిలో జేసీబీలతో పనులు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం డ్వామా పీడీ, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం ఏపీడీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. అలాగే మంగళవారం ఏపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 238 పనిదినాలు పనిచేసినట్టు చూపి రూ.70, 190 బిల్లులు జరిగాయని, అయితే ఇక్కడ పనులు జరగలేదని గుర్తించామన్నారు. ఈ పనులు జరిగినట్టు రికార్డు చేసిన టెక్నికల్ అసిస్టెంట్, బిల్లులు అప్రూవ్ చేసిన ఏపీవో, ఎంపీడీవోపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా మండల వ్యాప్తంగా ఇదే రీతిలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి మాఫియా బరితెగింపు!

- పంగిడి చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- పొలం మెరక చేసుకోవాలని రైతుల పేరుతో దరఖాస్తులు
- 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి... తవ్వింది లక్షపైనే
- ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున రవాణా
- రూ.లక్షల్లో దోచుకుంటున్న అక్రమార్కులు



పంగిడి చెరువులో సాగిస్తున్న మట్టి తవ్వకాలు

పెద్దాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అధికారులంటే భయం లేదు... ప్రజలు గమనిస్తారన్న లెక్కే లేదు... రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ధైర్యమో లేక తమను ఎవరేం చేస్తారన్న ధీమా కాబోలు... మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. కాకినాడ జిల్లా పెద్దాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పొలాల మెరక పేరుతో రైతులతో దరఖాస్తు చేయించి అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తున్నారు. 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి పొంది ఏకంగా లక్ష క్యూబిక్ మీటర్ల పైనే తవ్వేసినట్టు తెలుస్తోంది. నవకాన్ ఇన్‌ఫ్రా పేరుతో ట్రిప్ షీట్లు జారీ చేస్తూ తవ్వకాలు సాగించడంతో మట్టి అక్రమ రవాణా జరుగుతోందన్న అనుమానాలు నిజం అవుతున్నాయి. తరలిస్తున్న మట్టి ప్రధానంగా ఇటుక బట్టీలు, రియల్ వెంచర్ల కోసం పెద్ద ఎత్తున రవాణా చేస్తున్నట్టు సమాచారం. కాకినాడ, పరిసర ప్రాంతాల్లో వెలసిన వెంచర్లకు మట్టిని రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నట్టు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం క్యూబిక్ మీటరు రూపాయి చొప్పున ఇస్తే అక్రమార్కులు అడ్డదారుల్లో మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు అటువైపు కన్నెత్తి చూడట్లేదని పలువురు చెప్తున్నారు. పెద్దాపురం, వాలు తిమ్మాపురం పరిధిలో సుమారు 64 ఎకరాల విస్తీర్ణంలో పంగిడి చెరువు ఉంది. రైతుల పేరుతో కొంతమంది అక్రమార్కులు జలవనరుల శాఖకు దరఖాస్తు చేయించి మట్టి దందాకు తెరలేపారు. దీంతో జలవనరుల శాఖ అనుమతులు మంజూ రు చేసింది. అక్రమార్కులు రంగప్రవేశం చేసి రాత్రనక, పగలనక మట్టిని టిప్పర్ల సహాయంతో తరలించుకుపోతున్నారు. నిబంధనలకు విరు ద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నట్టు అధి కారులకు తెలిసినా రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అటువైపు కన్నెత్తి చూడట్లేదు.



నవకాన్ ఇన్‌ఫ్రా పేరుతో ఉన్న ట్రిప్ షీటు

పట్టించుకోని అధికారులు...

పొలం మెరక పేరుతో అనుమతి తీసుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కార్యకలాపాలకు మట్టిని తరలిస్తున్నారు. సాధారణ రైతులు మట్టి కావాలని అడిగితే సవాలక్ష ఆంక్షలు విధించే జలవనరుల శాఖ అధికారులు స్థా నిక నేతల సిఫార్సులతో ఆగమేఘాలపై అనుమతులు మంజూరు చేసేశారు. కాకినాడ, ఉండూరు, కరప, పిఠాపురం తదితర ప్రాంతాలకు మట్టిని తరలించేస్తున్నారు. నిత్యం 200 లారీలు పైబడి మట్టిని రేయింబవళ్లూ ఇబ్బడిముబ్బడిగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈతతంగం గత నెల రోజులుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు చెబుతున్నారు.

నిబంధనలకు నీళ్లు...

పంగిడి చెరువులో ఇరిగేషన్ అధికారులు ఒక క్యూబిక్ మీటర్ లోతు వరకే పూడికతీత పేరుతో అనుమతి ఇచ్చినట్టు తెలుస్తోంది. కానీ 7-8 అడుగులు లోతున చెరువును ఎడాపెడా తవ్వేశారు. పైగా రాత్రి సమయంలో కూడా ఈ తవ్వకాలు సాగిస్తున్నారు. వాస్తవానికి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే తవ్వకాలు జరగాల్సి ఉండగా మట్టి మాఫియా మాత్రం దీనిని పూర్తిగా విస్మరించింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసినా సరే అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పంగిడి చెరువులో మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. పొలం మెరక చేసుకు నేందుకు గతంలో జలవనరుల శాఖకు దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదు. పొలాలు మెరక చేసుకోవడానికి మట్టి దొరక్క సాధారణ రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు అక్రమార్కులకే ముందు అనుమతులు మంజూరు చేస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి.

జి.లక్ష్మణరావు, రైతు, పెద్దాపురం



ఆహారం రెడీమేడ్!

పక్షులకు ఆహారం పెట్టడానికి ధాన్యం కుచ్చులను ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తుంటారు. అయితే వాటిని కూడా రెడీమేడ్ దుస్తుల్లా రెడీ చేసి అమ్మేస్తున్నారు. కాకినాడలో ఆటోకు ఇలా ధాన్యం కుచ్చులను తగిలించి విక్రయాలు చేస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పెదపళ్లలో చోరీ

బీరువాలోని 11 కాసుల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి మాయం

ఆలమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో ఒక ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్టు ఆలమూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహదేవర వెంకటదుర్గఅచ్యుతవిశాలాక్షి ఇంట్లోని బీరువాలో బంగారు, వెండి ఆభరణాలు పెట్టి ఈనెల 4న తిరుపతికి వెళ్లారు. 7న వచ్చి చూచేసరికి బీరువాలోని 11 కాసుల బంగారు, 500 గ్రాముల వెండి ఆభరణాలు దొంగతనానికి గురైనట్టు గుర్తించి ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ కేసు నమోదు చేశారు.

పెట్టుబడులు రాకుండా జగన్ కుట్రలు

రాష్ట్రంలో 6లక్షల ఇళ్ల పూర్తికి ప్రణాళిక సిద్ధం : మంత్రి పార్థసారధి



తుని సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

తుని రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారని, పరామర్శల పేరుతో అరాచకాలకు పాల్పడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తేవిధంగా నడుచుకుంటున్నారని సమాచార గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. కాకినాడ జిల్లా తునిలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దివ్యతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక మొత్తంలో వస్తున్న పెట్టుబడులను చూసి జగన్ తట్టుకోలేకపోతున్నాడని, అభివృద్ధి జరిగి యువత ఉపాధి అవకాశాలు మెరుగుపడితే తమ ఆటలు సాగవని ఇప్పటి నుంచే పెట్టుబడులు రాకుండా వివిధ రూపాల్లో అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. పరామర్శలంటూ బయటకొచ్చి వీధి పోరాటాలకు ఆద్యం పోస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎంతోమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని వదిలిపోయారని, ఎన్నో కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడుదారులు రాష్ట్రం వైపు క్యూ కడుతున్నారని తెలిపారు. జగన్ అరాచకాలను తిప్పికొట్టి వైసీపీని ఎప్పటికీ ప్రతిపక్షంలోనే కూర్చోబెట్టాలన్నారు. అరాచకవాదులు, అవినీతిపరులే రెడ్‌బుక్‌ని చూసి భయపడుతున్నారని, ఎవరైతే వైసీపీ పాలనలో దుర్మార్గంగా వ్యవహరించారో వారికిప్పుడు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. రఫారఫా అనే పదాలు స్వయంగా సీఎంగా పని చేసిన వ్యక్తే మాట్లాడితే రాష్ట్రంలో యువత ఎటువంటి దారి పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 కల్లా రాష్ట్రంలో 6లక్షల ఇళ్లు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి ఉన్నారు.

ఎన్‌వోసీలు ఆపండి!

- 'పక్కాగా స్కెచ్'పై ఆంధ్రజ్యోతి కథనం ఎఫెక్ట్
- మైనింగ్ దరఖాస్తుదారులెవరికీ ఎన్‌వోసీలు ఇవ్వొద్దు
- ఉమ్మడి జిల్లాలో మైనింగ్ దరఖాస్తు దారులకు స్కెచ్‌ల విక్రయ బాగోతంపై కలెక్టర్ల ఆరా
- ఏడీ, ఇన్‌చార్జి డీడీని పిలిపించి తెరవెనుక వ్యవహారంపై నిలదీత
- అటు ఎవరెవరు ఎంత ముడుపులు ఇచ్చారో ఆరా తీయించిన కాకినాడ కలెక్టర్
- సర్వేయర్‌కు స్కెచ్‌ల కోసం డబ్బులు ఇచ్చింది నిజమేనని దరఖాస్తుదారుల అంగీకారం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన 53 దరఖాస్తులను రప్పించి స్కెచ్‌ల పరిశీలన
- అటు అక్రమాలకు పాల్పడిన సర్వేయర్‌ను పిలిపించి హెచ్చరించిన వైనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన మైనింగ్ దరఖాస్తులకు స్కెచ్‌లు విక్రయించి భారీగా వెనకేసుకున్న వ్యవహారంలో గలీజు సర్వేయర్‌కు ఉచ్చు బిగుస్తోంది. ఒకరికి తెలియకుండా మరొకరికి మైనింగ్ స్కెచ్‌లు విక్రయించడం, అటు భారీ మొత్తాల్లో డబ్బులు గుంజేసి స్కెచ్‌లు ఒకే వ్యాపారికి అందేలా చేసి అడ్డగోలు లబ్ధి చేకూర్చిన సదరు సర్వేయర్ తీరుపై విచారణకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్లు ఈ అక్రమాల బాగోతంపై దృష్టిసారించారు. రాజమహేంద్రవరం గనులశాఖ ఏడీ, కాకినాడ గనులశాఖ ఇన్‌చార్జి డీడీగా వ్యవహరిస్తున్న ఫణిభూషన్ రెడ్డిని వీరిద్దరు పిలిపించి విచారించారు. దరఖాస్తుల దాఖలుకు తప్పనిసరిగా అవసరమైన స్కెచ్‌ల విక్రయం వెనుక అసలు ఏం జరిగిందనే దానిపై ఆంధ్రజ్యోతిలో శనివారం వచ్చిన కథనంపై ఆరా తీశారు. దరఖాస్తుదారులకు స్కెచ్‌లు విక్రయించిన ఘటనలో సర్వేయర్ పాత్ర ఏస్థాయిలో ఉంది.. మొత్తం వచ్చిన దరఖాస్తుల్లో తొలి వరుసలో ఎవరు ఉన్నారు? దరఖాస్తుదారుల దాఖలు చేసిన స్కెచ్‌లకు ఎంతెంత వసూలు చేశారు? వంటి అంశాలపై ఇద్దరు కలెక్టర్లు విచారించారు. అటు దాఖలైన మొత్తం 53 దరఖాస్తుల్లో 42 వరకు కాకినాడ జిల్లా రౌతులపూడిలో క్వారీల మైనింగ్ కోసమే రావడంతో ఈ వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీరియస్ గా ఉన్నారు. మొత్తం దాఖలైన దరఖాస్తులన్నీ ంటిని రప్పించారు. ఆయా మైనింగ్ స్కెచ్‌లను పరిశీలించారు. ఎవరెవరు ఎంతెంత విస్తీర్ణానికి మైనింగ్ స్కెచ్‌లు జతచేశారో లోతుగా పరిశీలించారు. ఒక్కొక్క స్కెచ్‌కు సదరు సర్వేయర్ ఎంత వసూలు చేశారు? అనేదానిపై కొందరు ఆర్‌ఐల ద్వారా దరఖాస్తుదారులకు ఫోన్లు చేయించి విచారణ చేయించారు. ఈక్రమంలో తాము సర్వేయర్‌కు స్కెచ్ కోసం ఎంతెంత ముట్టజెప్పిందీ కూలంకుషంగా వారంతా వివరించారు. ఈ నేపథ్యంలో స్కెచ్‌ల పేరుతో డబ్బులు వసూళ్లు జరిగిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మైనింగ్ లీజుల మంజూరులో అత్యంత కీలకమైన ఎన్‌వోసీల జారీని తక్షణం నిలిపివేయాలని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహశీల్దార్లను కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ అక్రమాల బాగోతం తేలే వరకు ఏ వ్యాపారికీ నిరభ్యంతర పత్రాలు జారీ చేయకూడదని వారికి స్పష్టంచేశారు. అటు దాఖలైన దరఖాస్తులను సైతం లీజుల మంజూరుకు వీలుగా స్క్రూటీనీ చేయకుండా దరఖాస్తులను సీజ్ చేశారు. అలాగే లీజుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల్లో ఇతర ప్రాంతాల వ్యాపారులు ఉన్నారా? భారీ మైనింగ్ విస్తీర్ణం కోసం ఎవరెవరు అప్లికేషన్లు వేశారనేది విచారించారు. ఇదిలాఉంటే అక్రమాలకు పాల్పడి స్కెచ్‌ల విక్రయించిన సర్వేయర్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ మంగళవారం పిలిపించారు. స్కెచ్‌ల విక్రయంతో భారీగా వెనకేసుకోవడం, సర్వేయర్‌కు డబ్బులు ఇచ్చిన మాట వాస్తవమేనని దరఖాస్తుదారులు ఇప్పటికే విచారణలో వెల్లడించిన విషయాన్ని ఆయన ఎదుట ప్రస్తావించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తలవంపులు తెచ్చేలా వ్యవహరించడంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ ఎదుర్కోవాల్సిందేనని తెగేసి చెప్పారు. మరోపక్క పక్కాగా స్కెచ్ వేసి మైనింగ్ దర ఖాస్తుదారుల నుంచి లక్షల్లో డబ్బులు గుంజేసి రూ.కోటి వరకు డబ్బులు గుంజేసిన గలీజు సర్వేయర్‌పై ఆంధ్రజ్యోతిలో శనివారం, ఆదివారం వచ్చిన కథనాలపై ఇంటిలిజెన్స్ ఆరా తీసింది. సదరు సర్వేయర్ ఎవరెవరి నుంచి ఎంత వసూలు చేసిందీ వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపింది.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో అధికారులు, పోలీసులు

కాకినాడ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగిలో ఓ ఇంట్లో అక్ర మంగా నిల్వ చేసిన రూ.5,27, 077 విలువ చేసే 11 టన్నుల 335 కిలోల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకుని కాకినాడలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కి తరలించినట్టు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.వీరాస్వామి తెలిపారు. సామర్లకోట మండలం వీకే రాయపురానికి చెందిన తలారి వీరబాబు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటాడని, అదే గ్రామానికి చెందిన అనుమోలు వరహాలు బియ్యం వ్యాపా రం చేస్తుంటాడని, వారిద్దరూ తూరంగి డ్రైవర్స్ కాలనీలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేయడంతో దాడి చేసి పట్టుకున్నామ న్నా రు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని 6ఏతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశామని ఇంద్ర పాలెం ఎస్‌ఐ ఎం.వీరబాబు తెలిపారు.దాడిలో తూరంగి వీఆర్వోలు నాగేశ్వరరావు, సునీత, ఇంద్రపాలెం పోలీసులు రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గంజాయితో ఐదుగురి అరెస్ట్

4 కిలోల స్వాధీనం



నిందితులు, గంజాయితో సీఐ సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ అర్బన్ వెంకటేశ్వరనగర్ శివారు మద్ది లక్ష్మి గోడౌన్ వద్ద గంజాయి రవాణా జరుగుతున్నట్టు త్రీటౌన్ సీఐ కెవివి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లగా ఐదుగురు వ్యక్తులు ప్లాస్టిక్ కవర్లలో గంజాయిని కలిగి ఉండడాన్ని గుర్తించారు. నిందితుల్లో పిఠాపురం అగ్రహారానికి చెందిన సంగడాల రాజేష్ (21), పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన బోడా వీరసుబ్రమణ్యం అలియాస్ బన్ని (21), ఏఎస్‌ఆర్ జిల్లా చింతపల్లి మండలం బోరడొంకులు గ్రామానికి చెందిన కొర్ర సత్తిబాబు (47), గొల్లప్రోలు మండలం మార్కెండేయపురం గ్రామానికి చెందిన ఆరి అజయ్(27), పిఠాపురం చిట్టోడితోటకు చెందిన ఎర్రంశెట్టి అవినాష్ అలియాస్ పండు(21)ను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని కాకినాడ నాల్గో ఏజెఎఫ్‌సిఎం కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ వెల్లడించారు.

ధవళేశ్వరంలో ఇద్దరి అరెస్ట్

11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వైజాగ్ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకువస్తున్న 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన కె.పవన్‌కుమార్, కంబాల చెరువు ప్రాంతానికి చెందిన పి.సతీష్ అలియాస్ డింపు వైజాగ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ధవళేశ్వరంలో విక్రయించడానికి తీసుకురాగా ధవళేశ్వరం సీఐ టి.గణేష్, సిబ్బందితో వారిని పట్టుకుని 11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని మహిళ మృతి

భర్త, పిల్లలకు గాయాలు



పటవల సెంటర్‌లో మృతిచెందిన మహిళ

తాళ్లరేవు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మహిళ మరణించిందని కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు మండలం ఇంజరం జైభీమ్‌నగర్‌కు చెందిన దడాల శేఖర్ భార్య, పిల్లలను తీసుకుని మోటారుసైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి బయల్దేరాడు. పటవల సెంటరులో వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొనగా ఝాన్సీలక్ష్మి (28) అక్కడికక్కడే మృతిచెందింది. శేఖర్, పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పటవల పంచాయతీ మహిళా పోలీసు సమాచారం మేరకు కోరింగ పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన లక్ష్మణ్

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ఆటోను తప్పిస్తున్న ప్రయత్నంలో వెనుక వచ్చిన ఇసుక లారీకి వ్యక్తి బలై పోయాడు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కొండ మెరకకు చెందిన పువ్వుల లక్ష్మణ్(36) పెయింటింగ్ పనులు చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం పని కోసం స్కూటీపై రాజమహేంద్రవరం బయలుదేరాడు. సురాజ్యనగర్ పాలకేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నంలో ఆటో తగిలి కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వెనుక చక్రం లక్ష్మణ్ కాళ్ల పైనుంచి వెళ్లిపోవడంతో కాలు ఛిద్రమైంది. దీంతో అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కంటైనర్

డ్రైవర్ మృతి



మరణించిన డ్రైవర్ నాగార్జున

దేవరపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి కంటైనర్ లారీ వేగంగా ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గాయాలతో మరణించి సంఘటన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం నుంచి బెంగుళూరుకు చిన్న సిలిండర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ మంగళవారం దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద ఎదురుగా వెళ్తున లారీని ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ నాగార్జున (30)కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. అతడు కర్ణాటక రాష్ట్రం మార్సపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

ఏటీఎంలో మంటలు

యానాంలో ఐదు ద్విచక్ర వాహనాలు, కారు ఆహుతి



అగ్నికి అహుతైన ఏటీఎం, కారు, ద్విచక్రవాహనాలు

యానాం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యానాం బస్‌స్టాండ్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో అక్కడే ఉన్న మోకానిక్ షెడ్డుకు సంబంధించిన ఐదు ద్విచక్రవాహనాలు, కారు అగ్నికి అహుతయ్యాయి. ఉదయం 7 గంటల సమయంలో ఏటీఎం నుంచి మంటలు రావడాన్ని గమనించి స్థానికులు యానాం అగ్నిమాకశాఖకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపుచేశారు. అయితే ఈ ఏటీఎంలో 10 రోజుల క్రితం రూ.15లక్షల90వేల నగదు పెట్టడం జరిగిందని, కొన్ని రోజులుగా ఏటీఎం రిపేరు వచ్చిందని తెరిచి చూస్తేగాని ఎంత నగదు నష్టం వాటిల్లిందో తెలియదని రాజమండ్రికి చెందిన హిటాచి అధికారులు తెలిపారు. ఏటీఎం సంబంధించి సుమారు రూ.8లక్షల వస్తునష్టం జరిగిందన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని ఉండవచ్చని తెలుస్తోంది. యానాం అగ్నిమాపకశాఖ వివరాలను నమోదు చేశారు.

చెట్టుకు ఉరేసుకున్న బాలిక



మోతుగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోఉన్న కొత్తపల్లి పంచాయతీ గొందుగూడెం గ్రామంలో బాలిక ఉరే సుకుని మృతిచెందింది. మంగళవారం ఉదయం 8గంటలకు గొందుగూడెం గ్రామానికి చెందిన సేరామయ్య కుమార్తె కురాజయ రంపచోడవరం కాలేజీ నుంచి తిరిగి వచ్చి తమ పొలంలో చెట్టుకు చున్నీతో ఉరేసుకుని చనిపోయింది. సమాచారం తెలుసుకున్న మోతుగూడెం ఎస్‌ఐ సాదిక్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



మరణించిన మహిళ

అడ్డతీగల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం తుంగమడుగుల గ్రామ సమీపంలో రోడ్డుపక్కన గుర్తు తెలియని మహిళ ప్రమాదానికి గురైంది. దీంతో కొందరు బాటసారులు దుప్పులపాలెం ప్రభు త్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యాధికారులు సూచించారు. మృతురాలి వయస్సు సుమారు 30నుంచి40 ఏళ్ల ఉండవచ్చని, మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అడ్డతీగల, జూలై 8 (ఆంధ్యజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం భీముడుపాకలు మోదకొండమ్మ ఆలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుమారు 5 అడుగుల 7 అంగుళాల పొడవు ఉండి మృతదేహంపై పసుపురంగు డిజైన్ షర్టు, నీలం రంగుప్యాంటు, నలుపు రంగు చెప్పులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల సీఐ తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే 9440900768, 69కు సమాచారమివ్వాలని ఎస్‌ఐ వినోద్ కుమార్ కోరారు.



భీముడుపాకలు సమీపంలో లభ్యమైన వ్యక్తి మృతదేహం

అదృశ్యమైన ఇద్దరు బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

మండపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమవారం ఇంటి నుంచి హైస్కూల్‌కు బయలుదేరి కనిపించకుండా పోయారు. పోలీసులు వారి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థినులు పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారు అంగర పోలీసులను ఆశ్రయించారు. వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ప్రత్యేక పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు, అంగర ఎస్‌ఐ జి.హరీష్, మండపేట రూరల్ ఎస్‌ఐ వి.కిషోర్, సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి బాలికల ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. బాలికలు కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతి వైపు వెళ్తున్నారని సమాచారం అందుకున్న సిబ్బంది తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడ, ఒంగోలు, తిరుపతి రైల్వేస్టేషన్‌లలో రైల్వేపోలీసు ప్రొటెక్షన్ ద్వారా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌ఫార్మర్స్‌తో ట్రైన్‌ను తనిఖీ చేసి రాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు బాలికలను ఒంగోలు వద్ద గుర్తించి వారిని తిరిగి అంగరకు తీసుకిచ్చి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించామని డీఎస్పీ తెలిపారు. బాలికల మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలో చేధించిన రామచంద్రపురం డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

భూసారాన్ని పరిరక్షించాలి


సేంద్రియ కర్షనం ఆవశ్యకతను వివరిస్తున్న ఆదర్శ రైతు అడ్డాల

కేవీకేలో రెండో రోజు శిక్షణ

రాజానగరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): భావిత రాలకు సారవంతమైన నేలను అందించడం అందరి బాధ్యతగా గుర్తించాలని మునిరా ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ శాస్త్రవేత్త దిలీప్, అమలాపురానికి చెందిన అభ్యుదయ రైతు అడ్డాల గోపాలకృష్ణ ఆకాంక్షించారు. మండలంలో కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సమగ్ర పోషకాల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు రెండో రోజైన మంగళవారం కొనసాగింది. కార్యక్రమంలో దిలీప్ పాల్గొని సమతుల్య ఎరువుల వాడకం, నెమ్మదిగా విడుదలయ్యే ఎరువులు, వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. నేలలోని కార్బన్, నత్రజని శాతాలను పెంచడానికి పచ్చిరొట్ట ఎరువులు వాడేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. గోపాలకృష్ణ.. వర్మీ కంపోస్టు తయారీని ప్రదర్శించారు. కొబ్బరి పొట్టుతో తయారు చేసే బయో చార్‌ను నేలలో కలపడం వల్ల కార్బన్ శాతం గణనీయంగా పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకే వెటర్నరీ అధికారి బి.నాగేశ్వరరెడ్డి, సస్యరక్షణాధికారి రఘునందన్, పంటల అధికారి అజ్మల్, కాకినాడ జిల్లాకు చెందిన 30 మంది సొసైటీల అధికారులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

హిందువులు ఐకమత్యంగా ఉండాలి

అనపర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): హిందువులు కులాలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకు సాగినపుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని శృంగవృక్షం దత్త పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి మహరాజ్ అన్నారు. పీఠం నుంచి పిఠాపురం పాదయాత్రగా వెళ్తున్న స్వామిజీ మంగళవారం అనపర్తి చేరుకున్నారు. ఆయనకు దేవీచౌక్ వద్ద కూటమి నాయకులు, భక్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ 19 ఏళ్లుగా ఈ పాదయాత్ర చేస్తున్నానని, తొలి ఏకాదశి రోజున చేపట్టిన ఈ యాత్ర గురు పౌర్ణమికి పిఠాపురం చేరుతుందన్నారు. కార్యక్రమంలో సత్తి దేవదాన రెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, బాసి, తమలంపూడి సత్తిరెడ్డి, ఓగిరెడ్డి సత్తిరెడ్డి, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో ఆరోగ్యకరమైన జీవితం

గోకవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో ఆరోగ్యమైన జీవితాన్ని గడపవచ్చని జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని కామరాజుపేటలో పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి భరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి పలు రకాల పండ్ల మొక్కలను నాటారు. మండలానికి 300 ఎకరాలు లక్ష్యం కాగా 95 ఎకరాల్లో ప్లాంటేషన్ చేశామని ఏపీవో పీఎస్.అప్పలరాజు తెలిపారు.

రంగంపేట: మండలంలోని ముకుందవరంలో కూటమి నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. ఏపీవో నాగేశు మాట్లాడుతూ మండలంలో 60 ఎకరాలు లక్ష్యంగా ఉండగా మంగళవారం ఒక్కరోజే 60 ఎకరాల్లో మొక్కలు నాటించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డ్వామా ఏపీడీ బి.రామప్రసాద్, ఎండీవో వి.వి.సాయిబాబు, ఎడ్ల గణేష్, సర్పంచ్ వట్టికూటి సూర్యపద్మ పాల్గొన్నారు.

ఈ పథకం గురించి నాకు తెలీదు.. మీరే చేసుకోండి: బత్తుల

రాజానగరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకమా? ఆ పథకం గురించి నాకు చెప్పలేదే! ఏదో సచివాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం అనుకుని వచ్చా.. మీరే చేసుకోండి.. అంటూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెనుదిరిగారు. మండలం చక్ర ద్వారబంధంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల అసహనం వ్యక్తం చేశారు. ఈ పథకంలో ఇప్పటివరకు మండలంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో? ఎంత మందికి లబ్ధి చేకూరుతుందో తనకు చెప్పలేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మీరే చేసుకోండి అంటూ పథకం ప్రారంభించకుండానే అక్కడి నుంచి అసహనంతో వెళ్లిపోయారు. దీనిపై అధికారులు మిన్నకుండిపోయారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, ఇన్‌చార్జ్ ఏపీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన బలభద్రపురమే లక్ష్యం: నల్లమిల్లి

బిక్కవోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన బలభద్రపురమే లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం బలభద్రపురంలో ప్రజలకు క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయడానికి బసవతారకం ఇండో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దురదృష్టవశాత్తు పాజిటివ్ వస్తే రాష్ట్ర ప్రభుత్వం, డీఎంహెచ్‌వో, బసవతారకం ట్రస్టులతో కలిపి తగిన ట్రీట్‌మెంట్ ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నల్లమిల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు, స్థానిక వైద్యులు దుర్గాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కోళ్ల రైతుల సంక్షేమానికి కృషి

అనపర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కోళ్ల రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎగ్ బోర్డు ఏర్పాటుతోపాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వ పరంగా తీసుకోవలసిన చర్యలపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మర్రెడ్డి శ్రీనివాసరావు, కొవ్వూరి పాపారెడ్డి, తేతల ఉపేంద్రరెడ్డి, నల్లమిల్లి వీర్రెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల గ్రామాల ప్రజలను ప్రభుత్వం పునరావాస కాలనీలకు తరలించి చేతులు దులుపుకుందని, కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తన సర్వస్వాన్ని పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసి నిర్వాసితులుగా మారిన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, నాయకులు ఎల్.రామారావు, ఎం.వాణిశ్రీ, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం ధవళేశ్వరంలోని ప్రాజెక్టు అధికారి కార్యాలయం వద్ద నిర్వాసితులతో కలిసి ఆందోళన నిర్వహించి సమస్యలపై ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఏడాది కాలంలో ఒక్క కొత్త పథకం తీసుకురాలేదు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు

దివాన్‌చెరువు, జూలై8 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఏ ఒక్క కొత్త పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం తీసుకురాలేదని, గత ప్రభుత్వం అమలు చేసిన వాటిలో ఒకటి, రెండు పథకాల పేర్లు మార్చి అమలు చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు అన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ మండల సన్నాహక కార్యక్రమం దివాన్‌చెరువులోని డీబీవీ రాజు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగింది. పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వేణు విచ్చేసి మాట్లాడారు. రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, రాజానగరం నియోజకవర్గంలో అధికార పార్టీ పెద్దలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు.

ఆర్థిక మంత్రి పయ్యావులను కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కలిశారు. మంగళవారం సాయంత్రం అమరావతిలో మంత్రి కార్యాలయంలో పయ్యావులను కలిసి ఆటో ఫైనాన్షియర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. త్వరలో రానున్న బూల చట్టం వల్ల కలిగే నష్టాలను ఆయనకు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ చిన్న ఫైనాన్షియర్ల ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఏపీ ఫైనాన్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

మెగా పీటీఎం 2.0ను

విజయవంతం చేయాలి

» ఆర్జేడీ నాగమణి

» బిక్కవోలులో జిల్లా పరిషత్, మోడల్ ప్రాథమిక పాఠశాలల సందర్శన


పందలపాక హైస్కూల్లో విద్యార్థులతో యోగాసనాలతో వేసిన మెగా పీటీఎం 2.0 లోగో

బిక్కవోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రేపు నిర్వహించబోయే మెగా పీటీఎం 2.0ను విజయవంతం చేయాలని ఆర్జేడీ జి.నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మెగా పీటీఎం 2.0 సమవేశ ఏర్పాట్లపై చర్చించారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరు తప్పనిసరిగా సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. హోలిస్టిక్ కార్డులు అందజేసి విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించి, భవిష్యత్‌లో పిల్లలను ఏవిధంగా తయారు చేయాలన్నదీ తెలుసుకోవాలన్నారు. విద్యార్థులందరూ ఎస్ఆర్‌కేవీ కిట్లతో యూనిఫారమ్ ధరించి వచ్చేలా చూడాలన్నారు. తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్కను విద్యార్థులందరికీ అందించి వారి ఇళ్ల వద్ద వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డొక్కా సీతమ్మ భోజనాన్ని అతిథులకు, అధికారులకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు అందిచాలన్నారు. సమావేశ నిర్వహణకు వేసిన కమిటీలతో మెగా పీటీఎం 2.0ను సమర్థవంతగా నిర్వహించాలని హెచ్‌ఎం రమాదేవికి సూచించారు. అనంతరం గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్జేడీ వెంట ఎంఈవో సీహెచ్ వీవీ సత్యనారాయణ ఉన్నారు.


బిక్కవోలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి

మెగా పీటీఎం 2.0 ఆకృతి

మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాల విద్యార్థులు రేపు నిర్వహించబోయే మెగా పీటీఎం 2.0కు ముందుగా యోగసనాలతో మెగా పీటీఎం 2.0 ఆకృతి వేసి అందర్నీ ఆకట్టుకున్నారు. మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డిల ఆధ్వర్యంలో 550మంది విద్యార్థులతో మెగా పీటీఎం 2.0 ఆకృతిని వేయించారు.కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడే అఖిల భారత సమ్మె

» విజయవంతం చేయండి

» సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు


రాజమహేంద్రవరంలో సెంట్రల్ బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశ కార్మికుల న్యాయమైన హక్కులను కాపాడేందుకు ఈ నెల 9న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీఎస్ పూర్ణిమరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం దివాన్‌చెరువులో పంచాయతీ వద్ద పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులను బానిసలుగా చేయడమే కేంద్ర ప్రభుత్వం చర్య అని ఆరోపించారు. దీనిని కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, లేబర్ కోడ్లను రద్దుచేయాలని, రోజుకు ఎనిమిది గంటలు పని దినాన్ని దెబ్బ తీసే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు పులగుర్త సాయిబాబా ఓ ప్రకటనలో మాట్లాడుతూ కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ 9న కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా సంయుక్త కిసాన్‌మోర్చా, దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఖాతాలు, వేల కోట్ల బడ్జెట్ నిధులు, డిపాజిట్ల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు బ్యాంకులకు బదిలీ అయ్యాయన్నారు.ఈ నేపథ్యంలో సమ్మెను జయప్రదం చేయాలని సాయిబాబా పిలుపునిచ్చారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 9న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు యూనియన్లు ఏఐబీఈఏ బీఈఎఫ్ఐ, ఏఐబీఓఏ పాల్గొంటున్నారని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీపతిరావు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, బ్యాంకులు, ఎల్ఐసీ, బీమా, ప్రైవేట్‌పరం కాకుండా ఆపాలని, బ్యాంకుల్లో అన్ని కేడర్లలో నియామకాలు జరపాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీమా జీఎస్టీ రద్దు చేయాలని, సామాన్య ఖాతాదారులకు సర్వీస్ ఛార్జీలు తగ్గించాలన్నారు. బుధవారం శ్యామలా థియేటర్ ఎదురుగా డీసీసీబీ వద్ద ధర్నా చేస్తామని ఆయన తెలిపారు. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వాతి, ఉమారాణి, మురళీధర్, సూర్య, శివరామకృష్ణ, రమేష్, సోమరాజు, అప్పారావు, రాంబాబు, రవిచంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్ఐసీ.. సన్నాహక ప్రదర్శనలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొంటున్నారని రాజమండ్రి డివిజనల్ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం భోజన విరామంలో 3,4 తరగతి ఉద్యోగులు, విరామ సమయంలో డివిజనల్ ఆఫీసు ఆవరణలో సన్నాహక నిరసన ప్రదర్శనలు జరిపారు. కార్యక్రమం అధ్యక్షుడు మాథ్యూస్, పీఎస్ఎన్‌రాజు, సత్యదేవ జి.శ్రీనివాస్, వి.ఈశ్వరరావు, శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, బాలు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

» రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

» పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమాలు

రాజానగరం/కోరుకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి రాజానగరం మండలం తూర్పుగోనగూడెం, కలవచర్ల, కోరుకొండ మండలం గాదరాడ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాన్ని అందించారు. వైసీపీ రాక్షస పాలనలో గాడి తప్పిన ఆంధ్ర రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో పయనింపజేస్తోందన్నారు. ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, నూనె వెంకన్న, సంగీత సత్తిబాబు, సోడసాని త్రిమూర్తులు, గల్లా బాబ్జీ, కంటే నాగేశ్వరరావు, గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు, బుద్దా బాపూజీ, అడపా వీరబాబు, గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీనివాసు పాల్గొన్నారు.


శాటిలైట్ సిటీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

అనపర్తి/రంగంపేట: అనపర్తి మండలం పులగుర్త, రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఏడాది పాలనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామం లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాది పాలనలో ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమప్రాధాన్యమిచ్చిందని, కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, ఉద్దం ద్రావు శ్రీను, కొమ్మన రాంబాబు, అడబాల వెంకటరావు, గిరజాల సత్తిబాబు, ఉండవిల్లి గిరిబాబు, సాయిబాబు, రాజేష్, కాటన్, వెంకటేశులు, పేరిశెట్టి లాలయ్య, జాస్తి రాంబాబు, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 47,48 డివిజన్లలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఏడాది పాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకుని టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం మెరుగైన పరిపాలన వైపు ముందడుగు వేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి శాశ్వత భద్రత, అభివృద్ధి, ఉపాధి, ఆరోగ్యం విద్య వంటి రంగాల్లో పూర్తిస్థాయిలో భరోసానిచ్చేవిధంగా సూపర్ సిక్స్ పథకాలు రూపొందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, రెడ్డి మణేశ్వరరావు, బేసరి చిన్ని, కానేటి ప్రభుదాస్, అజ్జరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని శాటిలైట్ సిటీ గ్రామంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన సతీమణి ఝాన్సీ లక్ష్మి, అల్లుడు కంఠమనేని మురళీకృష్ణ, కుమార్తె కంఠమనేని శిరీష, మనుమలు సిద్ధార్థ, అవినాష్‌లతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ప్రజలు అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కృషితోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లతో పాటు మండల, గ్రామ కమిటీలు సమన్వయంతో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని తెలియజేయాలని చెప్పారు. ఏడాది కాలంలో శాటిలైట్ సిటీలో రూ.1.70 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, మజ్జి పద్మావతి, డొక్కా నాథ్‌బాబు, మద్దా మణి, పిల్ల తనుజ, నిచ్చెనకోళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించాలి

రంగంపేట పోలీస్‌స్టేషన్ తనిఖీలో ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య

రంగంపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను తగ్గించాలని, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య చెప్పారు. రంగంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఏడీబీ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఎస్.శివప్రసాద్‌కు, స్టేషన్ సిబ్బందికి చెప్పారు.

పాన్‌షాప్‌ల తనిఖీ

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

ధవళేశ్వరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పాఠశాలలో సమీపంలో ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలను సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో ధవళేశ్వరం సీఐ పి.గణేష్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కాలు, పాన్‌మసాలాలు అమ్ముతున్న వారికి మొదటి తప్పుగా భావించి ఆయా నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అపరాధ రుసుము విధించారు. మరోసారి నిషేధిత గుట్కాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన మంత్రి కొలుసు

కడియం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి మంగళవారం పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి స్వాగతించారు. పలు రకాల పుష్ప, ఫల, అర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలను మంత్రి తిలకించారు. మొక్కల విశిష్టత, శాస్త్రీయ నామాలు, పెంపకం వంటి విషయాలను పెదసత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో తహశీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

దివాన్‌చెరువు, జూలై 8(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.కళ్యాణ్ రైతులను కోరారు. మండలంలోని పాలచర్ల, భూపాలపట్నం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. ఈ నెల10 నుంచి ఈ-పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి చెప్పారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాలను పలు చోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం పేపరు మిల్లు వద్ద వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. 108, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్‌వంటి పథకాలతో రాష్ట్ర ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ లోని వైసీపీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ నివాళులర్పించారు. అలాగే తాడితోట సెంటర్ వాంబే గృహాల వద్ద, క్వారీ మార్కెట్, దానవాయిపేట ఫణీంద్ర స్కానింగ్ సెంటర్, కోటగుమ్మం వైఎస్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎంపీ పాల్గొన్నారు. 8వ వార్డులో సత్తిరెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పీసీసీ సభ్యులు బీలేపల్లి మురళీధర్, బోడా వెంకట్ నివాళులర్పించారు. స్థానిక ప్రకాశంనగర్ రౌండ్ పార్కు వద్ద ధర్మచర హాలుపైనున్న బుక్‌బ్యాంక్‌లో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ వైఎస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, అశోక్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియం దేవీచౌక్ సెంటర్‌లో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రైతులను సత్కరించారు. కడియపులంక దోసాలమ్మ కాలనీ వద్ద ఈలి గోపాలం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు విచ్చేసి నివాళులర్పించారు. గోపాలం సమకూర్చిన వస్త్రాలను పేదలకు పంపిణీ చేశారు. గిరజాల బాబు, యాదల స్టాలిన్ పాల్గొన్నారు. బుర్రిలంకలో కొత్తపల్లి శివాజీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోకవరం: గోకవరంలో పాతబస్టాండ్ వద్ద రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో మాజీ మంత్రి తోట నరసింహం పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తోట రాంజీ, సుంకర వీరబాబు, దాసరి చినబాబు, సుంకర రమణ పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని డీబీవీ రాజు కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి వైసీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, గూడూరి శ్రీనివాస్, గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ రాజకీయాల్లోనూ హీరోయే

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): తెలుగు చలనచిత్ర సీమలోనే కాదు రాజకీయాల్లోనూ తమ నాయకుడు పవన్ కల్యాణ్ హీరోయే అని జనసేన రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌పై వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ అధిష్ఠానం రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం పిఠాపురంలో జక్కంపూడి రాజా.. పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అభాసుపాలయ్యారన్నారు. పిఠాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతర పోరాటం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై విద్యాపరిషత్ నిరంతరం పోరాటం సాగిస్తుందని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సత్యసాయి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలోనూ దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థి పరిషత్ పనిచేస్తోందన్నారు. ర్యాలీలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాఘవ, పడాల నాగరాజు, సతీష్, లలిత్, రవీంద్ర, శివమణి, గోపి, పూర్ణ, అనూష తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: తమ్ముడు
సూర్యమినీ	: 3బీహెచ్‌కే
సూర్యప్యాలస్	: జురాసిక్ వరల్డ్
స్వామి	: కుబేర
శివజ్యోతి	: తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: జురాసిక్ వరల్డ్
రాజా	: తమ్ముడు
ఊర్వశి	: జురాసిక్ వరల్డ్
రంభ	: మార్గన్
మేనక	: షో టైమ్
అప్సర	: తమ్ముడు
కుమారి	: ----
అశోక	: కన్నప్ప
వీఎస్ మహల్(నామవరం)	: తమ్ముడు
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తమ్ముడు
వెంకటసూర్య(కడియం)	: తమ్ముడు
సత్యగౌరి (అనపర్తి)	: తమ్ముడు
సూర్యశ్రీ (అనపర్తి)	: కన్నప్ప
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: తమ్ముడు
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తమ్ముడు
శ్రీనివాస (గోకవరం)	: తమ్ముడు
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: జురాసిక్ వరల్డ్
లలితామహాల్(రంపచోడవరం)	: తమ్ముడు
నవయుగ(చింతూరు)	: తమ్ముడు



ధవళేశ్వరంలో ఇద్దరి అరెస్ట్
» 11 కిలోల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు,
» రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
8
రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

జిల్లావ్యాప్తంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'

రాజమహేంద్రవరం, జూలై8(ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాలతో ఎస్పీ నరసింహ కిషోర్ స్వీయ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్' నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాలలు, కళాశాలలకు 100మీటర్ల సమీపం లోని కిళ్లీ బడ్డీలు, కిరాణా దుకా ణాలు, ఫ్యాన్సీ తదితర షాపుల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. షాపుల్లోని డస్ట్‌బిన్‌లతో సహా క్షుణ్ణంగా పరిశీలించారు. పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఖైనీ నిల్వలు, నిషేధిత మత్తు పదా ర్థాల అమ్మకాలే లక్ష్యంగా ఈ సోదాలు చేశారు. పెద్దఎత్తున వాటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. వీటిలో 'లావాదేవీలు' జరిగాయని తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న సరుకు వివరాలు, కేసుల సంఖ్యను పోలీసులు వెల్లడించకపోవడం గమనార్హం.



రాజమహేంద్రవరంలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ప్రకాశంనగర్ సీఐ బాజీలాల్

నేటి నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో
బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్‌లెవెల్ అధికారుల(బీఎల్‌వో)కు శిక్షణ కార్యక్రమం ఈనెల 9 నుంచి 17వతేదీ వరకూ నిర్వహించనున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమాక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ శిక్షణకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 1581 మంది బూత్ లెవెల్ అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.



ఈ ఎసరు.. ఏంటీ?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రూ.5.80కే.. బిర్యానీ, వైట్ రైస్, కూర, పచ్చ డి, సాంబారు, మజ్జిగతో భోజనం ఎక్కడైనా దొరుకుతుందా?.. అదీ తిన్నంత!.. ఒక్క ఇడ్లీ కూడా.. అంతెందుకు మజ్జిగ కూడా ఆ ధరకు రావడం అసంభవమైన ఈ రోజుల్లో ఆ డబ్బు లకు బిర్యానీ? అని రక్కున ప్రశ్న నోటి నుంచి బయటకు వస్తోందా?.. అయితే ఇది చదవండి మరి!

» రూ.5.80కే మెనూ సాధ్యమా?
» మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కి వండి వడ్డించాలని ప్రధానోపాధ్యాయుల హుకుం
» గగ్గోలు పెడుతున్న ఎండీఎం కార్మికులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ శ్రీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథక కార్మికులను(ఎండీఎం) ఆందోళనకు గురి చేస్తోంది. ఆ రోజున హాజరయ్యే తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తమకు విందు భోజనం ఏర్పాటు చేయాలని ఎండీఎం కార్మికులను ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే ఆదేశించారు. టీలు, కాఫీలు మామూలుగానే అనుకొని అందించాలట. దీంతో తమకు ఈ 'ఎసరు' ఏంటని ఆ కార్మికులు వాపోతున్నారు.

● శ్రమ దోపిడీ

'నా కులం ఏంటో తెలుసా.. జిల్లా అధికారులకు నేను ఎంత చెప్తే అంత' ఓ కార్మికురాలిపై ఓ ప్రధానోపాధ్యాయుడు పారేసుకున్న మాటలు.. 'చెప్పు తీసుకుని కొడతా, స్కూలు నాదే.. పీకిపారేస్తాం'.. ఇది ఒక హెచ్‌ఎం 20 ఏళ్ల నుంచీ చేస్తున్న ఓ పెద్ద వయసు కార్మికురాలికి ఇచ్చిన వార్నింగ్. వీళ్లే కాదు చాలా మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు కనీసం కనికరం లేకుండా.. మహిళలని కూడా వీసమెత్తు గౌరవం లేకుండా ఆ కార్మికులపై రోజూ దర్పం ఒలకబోస్తున్నారు. అన్ని మాటలు పడుతూ పిల్లలకు వండి వార్చుతున్నా.. తాము మాత్రం పస్తులుండే పరిస్థితి ఉందని కార్మి కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉద్యోగ భద్రత కరువైందని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌కి రూ.5.80కే షడ్రుచులతో భోజనం పెట్టాలని హుకుం జారీ చేశారు. బిల్లు ఎప్పుడు చెల్లిస్తారో కూడా తెలియదు. దీంతో ఎండీఎం మహిళా కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. సాధ్యమైతే ఆ డబ్బులకు బయటి నుంచి భోజనాలు ఆ ధరకు తెప్పించుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే రాగిజావ, గుడ్లు వేపినందుకు పైసా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కనీసం కూలీ కూడా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6వేల వరకూ ఎండీఎం కార్మికులు(ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు) ప్రతిరోజూ వేలాదిమంది పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. బియ్యాన్ని ప్రభుత్వం ఇస్తుండగా నూనె, కూరగాయలు, గ్యాస్, దినుసులు, ఉప్పు అన్నీ ఎండీఎం కార్మికులే కొనుగోలు చేసుకోవాలి. ఇవాళ మార్కెట్లో ధరలతో పోలిస్తే నెలకు పైసా కూడా మిగ లడం కష్టంగా ఉంది. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.5.80 పైసల చొప్పున చెల్లిస్తుంది. ఒక్కోసారి తమకు గౌరవ భృతిగా ఇస్తున్న డబ్బులు సైతం వంటకే ఖర్చు పెట్టాల్సి వస్తోందని అంటున్నారు. ఈక్రమంలో ఎండీఎం కార్మికులకు కనీసం రోజు కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రమాదాలు జరిగినా పట్టించుకునే వారు లేరు. వారి దీన స్థితిపై ఈనెల 1న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. కార్మికులకు ప్రమాదాలు జరుగుతున్నాయని.. రాజమహేంద్రవరంలోని రెండు ఘటనలు దానిలో పేర్కొన్నారు. ఇంకేముందు.. ఓ స్కూలు హెచ్‌ఎం ఆ కార్మికురాలితో తనకేమీ కాలేదని ఓ కాగితం రాయించుకొని కలెక్టర్‌కి పంపించారని తెలిసింది. ఇది శ్రమ దోపిడీకి ఒక ఉదాహరణ మాత్రమే.

● విందు భోజనం పెట్టాలని ఆదేశం

ఎండీఎం భోజన పథకంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీల పేరుతో మహిళా కార్మికులు వండి వడ్డిస్తున్నారు. పథకం తొలినాళ్ల నుంచీ ఇప్పటికీ పని చేస్తున్న వాళ్లు ఉన్నారు. పిల్లలతో ఏదో తెలియని బంధం ఏర్పడి కొందరు.. ఎప్పటికైనా తమ శ్రమను ప్రభుత్వం గుర్తిస్తుందని మరికొందరు అలా రోజులు నెట్టుకొస్తున్నారు. కొందరు ప్రధానో పాధ్యాయులు వీరిపై దయ మాట అటుంచితే హీనంగా చూస్తున్నారు. ఇవన్నీ దిగమింగుకుంటూ పని చేస్తున్నారు. ఇప్పుడు ఈనెల 10న నిర్వ హించే మెగా పేరెంట్స్ మీటింగ్‌కి బిర్యానీతోపాటు నాలుగైదు రుచులతో పేరెంట్స్‌కి కూడా విందు భోజనం పెట్టాలని ఆదేశించారు. ఆ భోజనాలకు రూ.5.80 చొప్పున దయ కలిగినప్పుడు చెల్లిస్తారట. అంటే ఓ 50మందికి వడ్డిస్తే రూ.300 వస్తోంది. ఇలా సాధ్యమేనా.. సమంజసమేనా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు సుద్దులు చెప్పే ఉపాధ్యాయులు రూ.5.80కే విందు భోజనం ఎలా వండాలో తమకు చెప్పాలని కోరుతున్నారు. కలెక్టర్ కల్పించుకోవాలని వేడుకొంటున్నారు.



టెన్షన్‌లోను..!

కార్పొరేషన్ రుణాలకు ఎదురుచూపులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే స్వయం ఉపాధి రుణ యూనిట్లకు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ తరహా రుణాలను ఐదేళ్ల పూర్తిగా నిలిపి వేసింది. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్ రుణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అంతా సంబరపడ్డారు. తీరా రుణాలు మంజూరైనట్టే అయి నిలిచిపోవడంతో అసలు వీటిని ఎప్పుడు తిరిగిస్తారో తెలియక పడిగాపులు కాస్తున్నారు .ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రుణాలకు వేలల్లో పోటీ నెలకొనగా.. యూనిట్లు వందల్లోనే ఉండడంతో ఎక్కడి కక్కడ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో యూనిట్ల సంఖ్య మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరడంతో తదుపరి నిర్ణయం కోసం రుణాలు మంజూరు చేయకుండా నిలిపివేశారు. ఇప్పటికే రెండు నెలలు దాటడంతో అసలెప్పుడు వీటిని ప్రభుత్వం మంజూరు చేస్తుందోనని అంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 5,137 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయగా.. అదే స్థాయిలో మళ్లీ కోటా పెంచవచ్చని భావిస్తున్నారు.

మంజూరు చేసిన యూనిట్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల కింద భారీగా స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 2,405 రుణ యూనిట్లను మంజూరు చేశారు. వీటి కింద ఫ్లవర్‌బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్‌ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వెంచర్ టూరిజం, సబ్బులతయారీ, మొబైల్ కార్ వాష్, బేకరీ, ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో,కారు, గూడ్స్ ట్రక్‌వంటి వ్యాపారాలు చేసుకునేలా యూనిట్లు నిర్ణయిం చారు. ఆయా వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ మేరకు సామాజికవర్గాలవారీ దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది.

యూనిట్లు పెంచే యోచన..

ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ పథకం అమల్లోకి రావడంతో దరఖాస్తుదారులు వేలల్లో పోటె త్తారు. ఎంపికకాని వేలాదిమంది పేద యువత, నిరుద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు. అటు ఎమ్మెల్యేల అనుచరులు సైతం అర్హత ఉన్న తమవారికి కూడా యూనిట్లు రాలేదని విన్నవించారు. దీంతో నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. యూనిట్లు పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. ఆ తర్వాత జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ల్లోను జిల్లాల అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభుత్వంలో జరిగింది. దీంతో ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తిం పజేయాలని సమాచారం పంపించారు. అదనపు యూనిట్లు మంజూరు చేస్తామని రెండునెలలు దాటుతున్నా ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో అప్పటికే ఎంపికైన లబ్ధిదారులు, కొత్త యూనిట్లు వస్తాయని ఆశతో ఉన్న వారు నిరీ క్షిస్తూ కూర్చున్నారు. అసలు వీటిని ఎప్పుడు విడుదల చేస్తారంటూ జిల్లాల్లో ఆయా శాఖల అధికారులను అదే పనిగా సంప్రదిస్తున్నారు. అయితే యూనిట్ల పెంపు ఖాయమని, అది ఎప్పుడనేది తమకు కూడా సమాచారం లేదని జవాబు ఇస్తున్నారు.ప్రభుత్వం మాత్రం నియోజకవర్గాల వారీగా ఆయా సామాజికవర్గ అవసరాలను బట్టి త్వరలో కోటా నిర్ధారించి యూనిట్ల సంఖ్యను పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల తరపున కోటా కాకుండా ఎక్కువమంది సామాన్య యువతకు యూనిట్లు అందేలా సంఖ్యను నిర్ధారించి త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

» రెండు నెలల కిందట నిలిపివేత
» 5,137 యూనిట్లు మంజూరు
» 45,765 దరఖాస్తులు రాక
» ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి
» సీఎం దృష్టికి సమస్య
» పెంపు యోచనలో నిలిపివేత
» రెండు నెలలైనా తేలని నిర్ణయం



గత ఐదేళ్లూ.. రుణ ఊసేలేదు..

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు కార్పొరేషన్లను అటకెక్కించేసింది.నిరుద్యోగులకు రుణ సదుపాయం కల్పించకుండా వారిని ఇబ్బంది పెట్టింది.2019నాటికి మునుపటి టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు పంచడానికి సిద్ధంగా ఉన్న రుణాలు, పనిముట్లను సైతం మూలనపారేసింది. ఒకరకంగా చెప్పాలంటే ఐదేళ్ల పాటు ఈ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయకుండా నిరుద్యోగులను ఇబ్బంది పెట్టింది. ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో మళ్లీ బీసీ,కాపు, ఎస్సీ,ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు.

వేలల్లో దరఖాస్తులు

యూనిట్లు వందల్లో ఉంటే దరఖా స్తుదారులు వేలల్లో వచ్చారు. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీ పడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడలో రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454 దరఖాస్తులు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోన సీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీపడ్డారు. ఈడ బ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మం జూరు చేయగా 6 వేల మంది దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూ రవగా 5,497, కోనసీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తులు చేశారు.

సొసైటీలకు త్రీమన్ కమిటీల
నియామకం

» 22 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలు

రాజమహేంద్రవరం, జూలై8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాలు (పీఏసీఎస్)లకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. జిల్లాలో 107 సొసైటీలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం 22 సంఘాలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఒకరు ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. కామరాజుపేట పీఏసీఎస్ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా పిర్ల వెంకటేశ్వరరావు, సభ్యులు గంటా వీరబాబు, యడిబిల్లి కొండబాబు నియమితులయ్యారు. కడియం సొసైటీకి ఛైర్‌పర్సన్‌గా వెలుగుబంటి రఘురామ్, సభ్యులుగా ముద్రగడ సూర్యకాంతరావు, తుమ్మెద వరహాలరాజు, కడియపులంక సొసైటీకి ఛైర్‌పర్సన్‌గా గట్టి నరసయ్య, సభ్యులుగా కొటికలపూడి వెంకటేశ్వరరావు, అంజూరి వెంకట రామారావు, వేమగిరి సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా వెలుగుబంటి వెంకటాచలం, సభ్యులుగా పులుపు వెంకటరమణమూర్తి, పితాని శివరామ కృష్ణ, హుకుంపేట సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా బొప్పన శ్రీనివాస్, సభ్యులుగా సోము వినాయక్, మద్దిపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. రాజవోలు సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా వల్లూరి చెంచు రాజు, సభ్యులుగా పెంటగట్ల మణికంఠ, మద్దిరెడ్డి రాంబాబు, తొర్రేడు సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా దండమూడి బాపినీడు, సభ్యులుగా నల్లిరి రామ కృష్ణ, విన్నకోట శేషాచార్యులు, కాతేరు సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా నున్న బాబూరావు, సభ్యులుగా ఈదల రాఘవబాబు, సోముగంగాధర్ నియమితులయ్యారు. కొవ్వూరు శ్రీరామ పీఏసీఎస్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కంఠమణి రామకృష్ణారావు, సభ్యులుగా ఉప్పులూరి ప్రసాద్, దండుబోయిన మురళీకృష్ణ, పశివేదల సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా గారపాటి రామచంద్రారావు, సభ్యులుగా వేములపల్లి రత్న రాజేంద్ర, గూనపరెడ్డి శ్రీనివాసరావు, కాపవరం సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా సుంకర సత్తిబాబు, సభ్యులుగా వెంపటి సత్యనారాయణ, మడిచర్ల నాగవీరభద్రరావు, దొమ్మేరు సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా గారపాటి శ్రీవెంకటకృష్ణరామారావు, సభ్యులుగా సిద్ధగాని సావిత్రమ్మ, తోట ముద్దుల బాబు, అరికిరేవుల సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా చావా రామకృష్ణ శ్రీనివాసరావు, సభ్యులుగా మంకిన రామకృష్ణారావు, దాసరి కృష్ణ నియమితులయ్యారు. మద్దూరు సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా నాయుడు వీర్రాజు, సభ్యులుగా ఆకుల నాగరాజు, పిల్లి సత్యనారాయణ, మార్కొండపాడు సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా మద్దిపాటి వీరరాఘవులు, సభ్యులుగా ఉప్పులూరి ఆదినారాయణ, బొడ్డు వీరేంద్రచౌదరి, చిక్కాల సొసైటీ కమిటీఛైర్మన్‌గా యంత్రప్రగడ అబ్బులు, సభ్యులుగా కేతా సత్యనారాయణ, జక్కుల గంగరాజు నియమితులయ్యారు. కలవలపల్లి సొసైటీ ఛైర్మన్‌గా అబ్బూరి సీతారామాంజనేయులు, సభ్యులుగా గర్రే గురుప్రసాద్, నరమామిడి పెద్దగోవింద్, మలకపల్లి సొసైటీ ఛైర్మన్‌గా జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సభ్యులుగా సిద్ధా సీతారామకృష్ణ, బోడపాటి గంగరాజు, అన్నదేవరపేట సొసైటీ ఛైర్మన్‌గా గొరిజాల వెంకటప్రసాద్, సభ్యులుగా వెలుగుబంటి బాలకృష్ణ, చేవూరి బంగార్రాజు, తాడిపూడి సొసైటీ ఛైర్మన్‌గా నామా వెంకటసుబ్బారావు, సభ్యులుగా నామారంగనాయకులు, గొంటి వెంకట రమేష్ నియమితులయ్యారు. రాగోలపల్లి సొసైటీ ఛైర్మన్‌గా అనపర్తి నాగ వెంకట దుర్గారామకృష్ణప్రసాద్, సభ్యులుగా చలపతి శివరామకృష్ణ, బాలం చంద్రరావు, కురుకూరు సొసైటీ ఛైర్మన్‌గా యలమాటి భాస్కరరావు, సభ్యులుగా బొల్లం నాగేశ్వరరావు, నూతలపాటి గాంధీ నియమితులయ్యారు.

గరం గరంగా..

» రాజమహేంద్రవరంలో 'దిశ' సమీక్ష సమావేశం
» కేంద్ర పథకాలపై ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి రివ్యూ
» అజెండాలో 10 అంశాలపై చర్చ.. మిగిలిన 30 అంశాలు వాయిదా
» కొన్ని లెక్కలు తప్పుల తడకలని ప్రశ్నించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ
» పథకాలపై క్షేత్రస్థాయి అవగాహన తప్పనిసరన్న ఎంపీ





దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సంఘం సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఛైర్మన్ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు బత్తుల, నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము
సమావేశానికి హాజరైన పలు శాఖల అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సంఘం(దిశ) సమీక్ష సమావేశం మంగళవారం ఆద్యంతం గరంగరంగా సాగింది. నగరంలో దిశ కమిటీ ఛైర్మన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ పి.ప్రశాంతి హజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత జడ్పీ సీఈవో లక్ష్మణరావు సమావేశ వివరాలు వెల్లడించారు. ప్రతి మూడునెలలకు ఒకసారి దిశ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశం రెండోదని, ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి సమావేశమని చెప్పారు. అజెండాలో మొత్తం 40 అంశాలు ఉన్నట్టు తెలిపారు. అనంతరం ఛైర్మన్ పురందేశ్వరి మాట్లాడారు. కేంద్రప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు చేరువ కావాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు, ఇంకా ప్రతిపాదనలు, అవసరాలను చర్చించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించేందుకే ఈ సమీక్ష చేస్తున్నామన్నారు. తొలుత మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకం, జల్‌జీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి తాగునీరు, పసల్ బీమా అమృత్ పథకం, పింఛన్లు, క్యాన్సర్ బాధితుల లెక్కలు, క్షయ నివారణ, పీఎం సూర్యఘర్ పథకం, అర్టికల్చర్‌లో పండ్లతోటలు, కోకో, కొబ్బరి తదితర పంటలు, పలు పనుల రిపోర్టును అధికారులు వివరించారు. దీనిపై ఛైర్మన్ పురందేశ్వరి స్పందించారు. గ్రామీణ ఉపాధి హామి పథకంలో పనిదినాలు పెంచాలని, డ్రైయిన్‌ల నిర్మాణం అంచనా వ్యయాన్ని రూ.లక్ష నుంచి పది లక్షలకు పెంచాలని, రహదారుల వెడల్పులు పెంచాలని కేంద్రప్రభుత్వాన్ని కోరతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్ పనులు సక్రమంగా జరగలేదని వీటిపై విచారణ జరపాలన్నారు. సేంద్రియ వ్యవసా యం ద్వారా పండించిన పంటలకు సర్టిఫికేషన్ ఇవ్వాలని, వీటికి మెరుగైన ధర లభించడంకోసం మార్కెట్ యార్డులను ఈనామ్‌తో అనుసంధానించాలన్నారు. క్షయ నియంత్రణ కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ఒక టీబీ రోగిని దత్తత తీసుకోవాలన్నారు. క్షయమిత్రగా ఒక టీబీ పెషెంట్‌ను దత్తత తీసుకున్న కలెక్టర్ ప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఏడాదికి నాలుగు దిశ సమావేశాలు జరుగుతాయని, కచ్చితంగా జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. అనర్హులకు పింఛన్ల మంజూరులో చేసిన నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ జిల్లాలో గతంలో మొక్కలు నాటేకార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టారని కానీ చాలాచోట్ల ఆ మొక్కలు, చెట్లుగాని లేవన్నారు. ఒక్క విజ్జేశ్వరంలో మాత్రమే కొబ్బరి మొక్కలు పెరిగి ఏడాదికి రూ.లక్ష ఆదాయం వస్తోందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హెల్త్ సర్వే విషయంలో డోర్ టు డోర్ జరగడంలేదన్నారు. పొరపాట్లను సరిదిద్దుకోవాలని మెరుగైన సేవలు ప్రజలకు అందాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాట్లాడుతూ తన నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్ పథకంలో అవకతవకలు జరిగాయన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో తాగునీటి సమస్య ఉందని, పాలచర్ల నుంచి పైప్‌లైన్ వేస్తే పరిష్కారవుతుందన్నారు. తన నియోజకవర్గంలో కొన్ని ముఖ్యమైన పనులకు సంబంధించి జిల్లా అధికారుల నుంచి సమాచారం ఉండడం లేదని ప్రొటోకాల్ కూడా పాటించడంలేదన్నారు. సీతానగరం ఎంపీపీ జ్యోత్స్న, కడియం మండలం మాధవరాయుడుపాలెం సర్పంచ్, పెరవలి ఎంపీపీ కేఎస్ఆర్ ప్రసాద్, పలు సమస్యలు తెలిపారు. ఏపీఈపీడీసీల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వేణుమాధవరావు, నగరపాలక సంస్థ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్, పలు శాఖల జిల్లా అధికారులు, సీతానగరం, పెరవలి, కడియం, ఎంపీపీలు, చిట్యాల, కేశవరం, ధర్మవరం, ఎంఆర్‌పాలెం పంచాయతీ సర్పంచ్‌లు, దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

గోపాలపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో సత్వర పరిష్కారం కోసం రూ.70 వేలతో నూతన మోటారు పంపును కొనుగోలు చేసి నీటిని సరఫరా చేశామని గోపాలపురం పంచాయతీ కార్యదర్శి అనురాధ తెలిపారు. మేజర్ పంచాయతీ గోపాలపురం శివారులో ఉన్న ట్యాంకు వద్ద మోటారు కాలిపోవడంతో సరఫరాకు ఒక్కరోజు అంతరాయం ఏర్పడిందన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తాం

● 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



బ్రిడ్జిపేటలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 15వ వార్డు బ్రిడ్జిపేట, కాపవరంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ గత ఏడాది కాలంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, దాయ న రామకృష్ణ, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ, కండెల్లి రామారావు, బొల్లారపు మేరిసువార్త, కె.మోహనరావు, జువ్వల సీవమ్మ, వీరుబండి ప్రసాద్, బి. యోహాను, వి.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. మంగళవారం పసలపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలోమండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఈర్పిన సత్యనారాయణ, నాయకులు బలుసు వెంకటరత్నం, ఎం. పాండురంగం, కాకర్ల బాపయ్య, కార్యకర్తలు, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు:ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ అన్నారు. మంగళవారం చాగల్లు మహాలక్ష్మి అమ్మవారివీధిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, దొంగ రామకృష్ణ, జే. వెంకాయమ్మ, అల్తాఫ్ అహ్మద్, ఆళ్ల సూర్యప్రకాశరావు, డొక్కు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో జరిగిన కార్యక్రమంలో శేషారావు, తదితరులు



చాగల్లులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

చాగల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వరి సాగు చేసే రైతులు ఎరువుల వాడకంలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఏవో కే. వేణుగోపాలకృష్ణ సూచించారు. మంగళవారం మల్లవరం, గౌరిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులను పంట ఆఖరి దమ్ములో లేదా నాట్లు వేసిన వారం రోజుల్లోపు వేసుకోవాలన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్. శ్రీనివాస్, రైతులు మద్దిపాటి వెంకటరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

ఉండ్రాజవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ సాగుపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మోర్తలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి సీజన్లో విత్తనం వేసినప్పటి నుంచి కోత కోసేంత వరకు 14 వారాలు 30 మంది రైతులను ఎంపిక చేసి ప్రతివారం వారికి సాగులో నూతన విధానాలు వివరిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏవో బీ. రాజారావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఉండ్రాజవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ బి. దుర్గామల్లేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు, దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. తర్వాత పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. ఉషాదేవి, సీహెచ్‌వో ఎం. సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీఎల్‌కుమారి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మకు మంత్రి ప్రత్యేక పూజలు



గోపవరంలో మంత్రి దుర్గేష్‌కి ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

నిడదవోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో వేంచేసి వున్న గుబ్బాలమ్మ వారికి మంగళవారం ఆషాఢమాసం సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయనకు ఆలయ ప్రధాన అర్చకుడు రఘుకుమార్ శర్మ ఆశీర్వచనాలు అందించారు. ఉదయం నుంచి మహాలక్ష్మి హోమం, మహాపూర్ణాహుతి, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు , ఇతరులు

కొవ్వూరు, జూలై8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరుతూ బుధవారం చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు మాట్లాడుతూ కార్మిక వెల్ఫేర్ బోర్డును తిరిగి పునః ప్రారంభించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ పథకాలు అమలుకాక పెద్దఎత్తున నష్టపోయారన్నారు. కార్మిక సంక్షేమ బోర్డులో రూ. 4298 కోట్ల నిధులున్నప్పటికీ సరిగ్గా అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మాణిరెడ్డి హరిబాబు, సిద్ధిరెడ్డి బాపిరాజు, కనకారావు, సోమేశ్వరరావు, శ్రీను, కొండబాబు పాల్గొన్నారు.

పొగాకు, గంజాయి విక్రయాలు చేపడితే చర్యలు

● కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్



పాన్‌షాపుల్లో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ దేవకుమార్, పోలీస్ సిబ్బంది

కొవ్వూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పొగాకు, గంజాయి ఉత్పత్తులను విక్రయిస్తే అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు మంగళవారం పట్టణంలోని పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఏబీఎన్ కళాశాల వద్ద, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ జిల్లా ఆదేశాల మేరకు ఆపరేషన్ క్యాంపస్ నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 100 మీటర్ల దూరంలో ఎటువంటి పొగాకు గానీ గంజాయి ఉత్పత్తులను విక్రయించరాదన్నారు. తనిఖీలు మరో ఐదు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. పట్టణ సీఐ పి.విశ్వం, ఈగల్ టీమ్ ఎస్ఐ నరేష్, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

దేవరపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సార్వా సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్‌ను ప్రతి రైతు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కమల్‌రాజు పేర్కొన్నారు. సంగాయిగూడెం, యర్నగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలరాజు మాట్లాడుతూ పంట నమోదు ప్రతి ఒక్కరూ చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని కౌలురైతులు తప్పనిసరిగా టీసీఆర్‌సీ కార్డులు చేయించుకోవాలన్నారు. పంటలబీమా పథకం గురించి రైతులకు వివరించటం జరిగిందన్నారు. మండలంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఈ యూరియా సరఫరాకు ఎటువంటి కొరతలేదన్నారు. కార్యక్రమంలో బొంతా భరత్‌బాబు, గద్దే శ్రీనివాస్, కరుటూరి శ్రీనివాస్, విజయ్ భాస్కర్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

దేవరపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి కంటైనర్ లారీ వేగంగా ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన దేవరపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నుంచి బెంగుళూరుకు చిన్న సిలిండర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున లారీని ఢీకొట్టింది. దీంతో కంటైనర్ డ్రైవర్ నాగార్జున (30) తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని వెంటనే 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. కర్ణాటక రాష్ట్రం మార్సనపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

కొవ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ షైగాపుల దుర్గారావు తెలిపారు. గత నెల 28వ తేదీన కొవ్వూరు, దొమ్మేరు రోడ్‌లోని పెట్రోల్‌బంకు వద్ద గుర్తుతెలియని 25 సంవత్సరాల యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన యువకుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఈనెల 7వ తేదీన మృతి చెందాడు. ఈయనకు సంబంధించి ఎలాంటి వివరాలు తెలియరాలేదు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, వీఆర్వో కుందేటి మౌనిక అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన చింతా గోపి మహేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాకపోవడంతో సోదరి లావేటి రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాలేజ్ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఇరువురికి గాయాలైనట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. వేగేశ్వరపురానికి చెందిన కోపల్లి రాంబాబు, తాళ్లపూడికి చెందిన తమ్మిరిశి నాగరాజు ఆటోలో మంగళవారం రాజమహేంద్రవరం బయలుదేరాడు. అయితే కొవ్వూరులోని రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని పెట్రోల్‌బంకులో ఆయిల్ కొట్టించుకుని రోడ్డు ఎక్కుతుండగా బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి. కోపల్లి రాంబాబు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

దొంగతనంపై కేసు నమోదు

కొవ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్ దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీ.శ్రీనివాస్ తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలోని అవంతీ ఫ్యాక్టరీ ఎదుట ప్రాంతంలో బొల్లా కనకదుర్గా ప్రసాద్ ఈనెల 7వ తేదీ రాత్రి తన ఇంటిముందు బైక్‌ను పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు. అలాగే పట్టణానికి చెందిన గోడా సుందర సింగ్ 13 రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లి మంగళవారం తిరిగివచ్చాడు. దీంతో ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విశ్వం తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు మంచి పాలన : ఎమ్మెల్యే



కొవ్వూరుపాడులో మద్దిపాటికి హారతిపడుతున్న మహిళలు

గోపాలపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రావు అన్నారు. మంగళవారం కొవ్వూరుపాడు, కరగపాడు, బుచ్చయ్యపాలెం, సాగిపాడు, దొండపూడి, రాజంపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు హారతి పట్టారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ఎంతవరకు అందాయి, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, కొవ్వూరుపాడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, కొవ్వూరుపాడు, కరగపాడు, దొండపూడి, రాజంపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహమూర్తి, కుచ్చు వెంకటేశ్వరరావు, ముత్యాల రాయుడు, నందమూరి సత్యనారా యణ, కరగపాడు ఎంపీటీసీ జక్కు సూర్యచంద్రం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు కొబ్బరి, జీడి మామిడి మొక్కల పంపిణీ



మొక్కలు నాటిస్తున్న ఏపీవో రమాదేవి, పాల్గొన్న రైతులు

తాళ్లపూడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని పలుగ్రామాలలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొబ్బరి, జీడిమామిడి, మామిడి మొక్కలను పంపిణీ చేశారు. తిరుగుడుమెట్టలో నున్న దుర్గా ప్రసాద్ అనే రైతుకు కొబ్బరి మొక్కలు అందించారు. అలాగే పోచవరంలో కూచిపూడి రామారావు అనే రైతు పొలంలో జీడిమామిడి మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఏపీవో రమాదేవి మాట్లాడుతూ 15 ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. రెండు సంవత్సరాల వరకూ ఈ మొక్కలను పెంచేందుకు అయ్యే ఖర్చును ఎన్ఆర్‌జీఎస్ ద్వారా నిధులు మంజూరు చేసి వీటిపై పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. మండలంలో ఐదెకరాల లోపు భూమి ఉన్న సన్న చిన్నకారు రైతులు పండ్ల తోటల పట్ల ఆశక్తి ఉన్న వారు ముందుకు వస్తే వారికి కూడా జీడిమామిడి, కొబ్బరి, మామిడి, పంటలకు ప్రోత్సాహం అందిస్తామని ఏపీవో తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి'



హైస్కూల్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన హేమస్మిత

దేవరపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని దేవరపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత పేర్కొన్నారు. దేవరపల్లిలో అంబటి సత్యనారాయణరావు జడ్పీస్కూల్‌లో పొగాకు బోర్డు స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు తమ ఇంటి వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు పరిమి శ్రీరామకృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, ఈలప్రోలు చిన్ని, సిబ్బంది, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై కేసు

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన ఒంటరి మహిళను అదే గ్రామానికి చెందిన మర్రి శోభన బాబు లైంగికంగా వేధిస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై మంగళవా రం కేసు నమోదు చేసినట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించి విచారిస్తు న్నట్టు ఆయన చెప్పారు. ఒంటరి మహిళ సోమవారం తన ఇంట్లో వంట చేస్తుండగా శోభనబాబు వెళ్లి అత్యాచారం యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఆమె తలకు దెబ్బతగిలింది. దీంతో తాడేపల్లిగూడెంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. సోమవారం సాయంత్రం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం కేసు నమోదు చేశారు.

పురుగుల మందు సేవించి ఒకరి మృతి

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన ఉప్పులూరి గోపాలకృష్ణ (47) ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు సేవించాడు. దీంతో ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం గోపాలకృష్ణ వ్యవసాయ కూలీగా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్యసత్యవతి, కుమార్తె ఉన్నారు.

ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి



రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి, రమేష్‌బాబు , తదితరులు

కొవ్వూరు/ పెరవలి /తాళ్లపూడి/ దేవరపల్లి/ నిడదవోలు/జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని కొవ్వూరు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వైసీపీ నేతలు మెరకవీధి, మెయిన్‌రోడ్డులోని పుంతలో ముసలమ్మ వారి ఆలయం వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేశా రు. రైల్వేస్టేషన్ వద్ద గల లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్ బాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పట్టణం, మండలానికి చెందిన 80 మంది కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, శ్రీనివాసరెడ్డి, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడు బిల్డర్ చిన్నా, రూరల్ అధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ, ఆరే శ్రీనివాస్, బి. శ్రీను, చేకూరి మణికంఠరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దేవరపల్లి, పెరవలి, నిడదవోలు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లోనూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీమంత్రి తానేటి వనిత, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పోషకాహార కిట్లు అందజేత

పెరవలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానూరు అగ్రహారంలో టీబీ వ్యాధిగ్రస్తులకు మంగళవారం పోషకాహార కిట్లను డాక్టర్ పి. తేజశ్రీ, కొవ్వూరు డివిజన్ కానూరు టీబీ యూనిట్ ఎస్‌టీఎస్ జీ. ఆశాజ్యోతి పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఇచ్చిన పిలుపు మేరకు గ్రామంలో జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సాదా వెంకట్ ముగ్గురు టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వారికి ఆరు నెలలు పాటు పోషకాహారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా డాక్టర్ తేజశ్రీ, టీబీ యూనిట్ ఎస్‌టీఎస్ జీ. ఆశాజ్యోతి దాతలను అభినందించారు. ప్రతిఒక్కరూ దీన్ని అభినందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసం వెంకన్న, వైద్యసిబ్బంది, 104 సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి... తొమ్మిది మంది అరెస్టు

కొవ్వూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. దేచర్లలో మంగళవారం పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇందులో రూ.4,510 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ధవళేశ్వరంలో ఇద్దరి అరెస్ట్

●11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వైజాగ్ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకువస్తున్న 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన కె.పవన్‌కుమార్, కంబాల చెరువు ప్రాంతానికి చెందిన పి.సతీష్ అలియాస్ డింపు వైజాగ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ధవళేశ్వరంలో విక్రయించడానికి తీసుకురాగా ధవళేశ్వరం సీఐ టి.గణేష్, సిబ్బందితో వారిని పట్టుకుని 11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్ ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



దేచర్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ముప్పిడి , తదితరులు

కొవ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దేచర్లలో మంగళవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా జీడీ మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణవాయువును ఇచ్చే మొక్కలను సంరక్షించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మంచిదన్నారు. ఎంపీడీవో టీవీవీ రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరులో 'పొలంబడి'

కొవ్వూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): సార్వా సాగులో రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టాలని కొవ్వూరు డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.మంగళవారం కొవ్వూరులో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వా వరి సాగులో రైతులు విత్తనాలు వేసుకుని, నారుమడి పెంచుకోవడంలో నిమగ్నమయ్యారన్నారు. ఈ దశలో విత్తనశుద్ధి, నారుమడిలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏవో ఏ.గంగాధర్, విస్తరణాధికారి కె.వరలక్ష్మి, ఎంపీఈవో నవీన్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.